జ్ఞాని పురుష్ దాదా భగవాన్ నిర్వచించిన

# జరిగిందే న్యాయం



ప్రకృతి న్యాయంలో ఒక్కక్షణమైనా
అన్యాయం జరగలేదు

Telugu

జ్ఞాని పురుష్ దాదా భగవాన్ నిర్వచించిన

# జరిగిందే న్యాయం

మూల గుజరాతి సంకలనం - డా.నీరు బెహన్ అమీన్

తెలుగు అనువాదం - మహాత్మగణం

**ప్రకాశకులు :** అజీత్ సి.పటేల్
దాదా భగవాన్ విజ్ఞాన్ ఫౌండేషన్
1, వరుణ్ అపార్ట్‌మెంట్, 37,శ్రీమాలి సొసైటీ
నవరంగ్‌పురా పోలీస్ స్టేషన్ ఎదురుగా,
నవరంగ్‌పురా, అహ్మదాబాద్ – 380009
గుజరాత్, భారత్
ఫోన్: + 91 7935002100, +91 9328661166/77

**కాపీ రైట్ :** © Dada Bhagwan Foundation,
5, Mamta Park Society, B\h. Navgujarat College,
Usmanpura, Ahmedabad -380014, Gujarat, India.
**Email :** info@dadabhagwan.org
**Tel :** +91 9328661166/77

**All Rights Reserved. No part of this publication may be shared, copied, translated or reproduced in any form (including electronic storage or audio recording) without written permission from the holder of the copyright. This publication is licensed for your personal use only.**

మొదటి ముద్రణ : July 2007 (1000 Copies)

రెండవ ముద్రణ : July 2015 (1000 Copies)

మూడవ ముద్రణ : December 2025 (500 Copies)

భావ మూల్యం : 'పరమ వినయం', మరియు "నాకు ఎంతమాత్రం తెలియదు. అదే భావన

ధర : 50 Rs

ముద్రిక : అంబా మల్టి ప్రింట్
హెచ్.బి.కపాడియా న్యూ హైస్కూల్ ఎదురుగా,
ఛత్రల్-ప్రతాప్పురా రోడ్, ఛత్రల్,
తాలూకా. కలోల్, జిల్లా.
గాంధీనగర్ – 382729, గుజరాత్.
ఫోన్: +91 79 3500 2142

**ISBN/eISBN** : 978-93-86289-17-9

**Printed in India**

# త్రిమంత్రం







నమో అరిహంతాణం

నమో సిద్ధాణం

నమో ఆయరియాణం

నమో ఉవజ్ఝాయాణం

నమో లోయే సవ్వ సాహూణం

ఏసోపంచణమోక్కారో,

సవ్వాపావప్పణాసణో

మంగళా ణం చ సవ్వేసిం,

పడమం హవయీ మంగళం

ఓం నమో భగవతే వాసుదేవాయ

ఓం నమో శివాయ

జై సచ్చిదానంద



# దాదా భగవాన్ ఎవరు?

అది జూన్ 1958 లో ఒక సాయంత్రం సమయం సుమారు 6:00, ప్రదేశం రద్దీగా ఉన్న సూరత్ పట్టణ రైల్వే స్టేషన్‌లో ప్లాట్‌ఫార్మ్ నం.3.లో బెంచీ మీద కూర్చునివున్న శ్రీ అంబాలాల్ మూల్జీ భాయ్ పటేల్ అనే దేహమందిరంలో, ప్రకృతిపరంగా, అక్రమ రూపంలో, ఎన్నో జన్మలుగా వ్యక్తమయ్యేందుకు ఆత్రుతగా ఎదురుచూస్తున్న 'దాదా భగవాన్' పూర్ణ రూపంలో ప్రకటితమయ్యారు, ఆధ్యాత్మిక అద్భుతంలా. ఒక గంట సమయంలోనే ఆయనకు విశ్వ దర్శనం అయింది. "నేనెవరు? భగవంతుడు ఎవరు? విశ్వాన్నంతా ఎవరు నడిపిస్తున్నారు? కర్మ అంటే ఏమిటి? ముక్తి అంటే ఏమిటి?" ఇలాంటి ప్రపంచంలో ఆధ్యాత్మిక ప్రశ్నలన్నిటికీ సమాధానం వచ్చింది. ఈ విధంగా దైవం, విశ్వానికి సంబంధించిన ఒక అద్వితీయమైన పూర్ణ స్వరూప దర్శనం కావించింది, దాని ఫలస్వరూపమే శ్రీ అంబాలాల్ మూల్జీ భాయ్ పటేల్, గుజరాత్‌లోని చరోతర్ క్షేత్రంలోని భాదరణ్ గ్రామంలో పాటీదార్, ఒక కాంట్రాక్ట్ పని చేసే వ్యక్తి, అయినా కూడా సంపూర్ణ వీతరాగ పురుషుడు.

"వ్యాపారంలో ధర్మం పాటించాలి కాని, ధర్మాచరణలో వ్యాపారం చేయగూడదు" అనే సిద్ధాంతంతోనే ఆయన జీవితమంతా గడిపారు. ఆయన ఎప్పుడూ ఎవరి దగ్గరి నుంచీ డబ్బు తీసుకోలేదు సరికదా తన ఆదాయం నుంచే తీర్థయాత్రలు చేసే భక్తులకు ఆర్థిక సహాయం చేసారు.

ఆ విధంగా ఆయనకు కేవలం రెండు గంటలలోనే సిద్ధించిన అద్భుతమైన జ్ఞానాన్ని ఉపయోగించి, ఆయన ఎందరో ముముక్షువులకు ఆత్మజ్ఞానాన్ని ప్రసాదించారు. దాన్ని ఆయన అక్రమ మార్గం అని అన్నారు. అక్రమ అంటే ఒక క్రమం లేని అర్థం. క్రమం అంటే ఒక మెట్టు పైన మరో మెట్టుని క్రమంగా ఎక్కుతూ వెళ్ళటం. అక్రమ మార్గమంటే షార్ట్‌కట్‌లో లిఫ్ట్ ద్వారా పైకి చేరుకోవటం.

ఆయన "దాదా భగవాన్ ఎవరు" అన్న రహస్యాన్ని స్వయంగా చెప్తూ, "మీ ముందు కనిపిస్తున్న ఈ ఆకారం దాదా భగవాన్ కాదు. ఈయన ఎ.ఎమ్.పటేల్. మేము ఒక జ్ఞానపురుషుడను, లోపల ప్రకటితమైనది దాదా భగవాన్. దాదా భగవాన్, 14 లోకాలకు నాధుడు. ఆయన మీలో కూడా ఉన్నాడు. అందరిలోనూ ఉన్నాడు. మీలో అవ్యక్త రూపంలో ఉన్నాడు, నాలో సంపూర్ణ రూపంలో వ్యక్తమై ఉన్నాడు. ఆ దాదా భగవాన్ గారికి నేను కూడా ప్రణామం చేస్తాను"

# ఆత్మజ్ఞానానికి ప్రత్యక్ష లింక్

"నేను నా చేతులతో కొందరికి సిద్ధిని ప్రసాదించబోతున్నాను. నా తర్వాత ముందుకు నడిపేవాళ్ళు ఉండాలి కదా! నా తర్వాత కూడా మనుషులకు మార్గం చూపించేవాళ్ళుండాలి కదా!"

–దాదాశ్రీ

పరమ పూజ్య దాదాశ్రీ పల్లెపల్లెకు దేశవిదేశాలలో తిరుగుతూ ముముక్షువులకు సత్సంగం, ఆత్మజ్ఞాన ప్రాప్తిని కలిగిస్తూవచ్చారు. వీరు తమ జీవితకాలంలోనే పూజ్య డా.నీరు బెహన్ అమీన్ (నీరూ మా) కి ఆత్మజ్ఞానాన్ని కలిగించి జ్ఞానసిద్ధిని ప్రసాదించారు. దాదాశ్రీ దేహాన్ని చాలించిన తర్వాత నీరూ మా, ముముక్షువులకు సత్సంగం, ఆత్మజ్ఞాన ప్రాప్తిని నిమిత్త భావనతో చేస్తూవస్తున్నారు. పూజ్య దీపక్ భాయ్ దేశాయ్‌కి దాదాశ్రీ, సత్సంగాన్ని నిర్వహించే సిద్ధిని ప్రసాదించారు. నీరు మా సమక్షంలోనే, ఆమె ఆశీర్వాదంతోనే పూజ్య దీపక్ భాయి దేశవిదేశాలలో ఎన్నో ప్రాంతాలకు వెళ్ళి, ముముక్షువులకు ఆత్మజ్ఞాన ప్రాప్తిని కలిగించి వచ్చారు. ఆ పని ఇప్పటికీ నీరూమా దేహాంతం తర్వాత కూడా కొనసాగుతూనేవుంది. ఆత్మజ్ఞాన ప్రాప్తి తర్వాత ఎందరో ముముక్షువులు ప్రపంచంలో ఉంటూ, తమ తమ బాధ్యతలను సక్రమంగా నెరవేరుస్తూ, ముక్త పురుషులుగా ఆత్మానందాన్ని అనుభవిస్తున్నారు.

ఈ గ్రంథంలో ముద్రితమైన వాణి, మోక్షార్థుల మార్గదర్శనంలో ఎంతో ఉపయోగకరం. కానీ, మోక్షప్రాప్తి కోసం ఆత్మజ్ఞానాన్ని పొందటం అవసరం. అక్రమ మార్గంలో ఆత్మజ్ఞానాన్ని పొందేందుకు ఇప్పటికీ మార్గం తెరిచేవుంది. దీపకళిక మరో దీపాన్ని వెలిగించినట్లుగానే, ప్రత్యక్షంగా ఆత్మజ్ఞాని నుంచే ఆత్మజ్ఞాన ప్రాప్తిని కలిగించుకొని తన ఆత్మను జాగృతం చేసుకోవచ్చు.

# విన్నపం

జ్ఞాని పురుషులు పూజ్య దాదాభగవాన్ శ్రీముఖం నుంచి వెలువడ్డ ఆధ్యాత్మిక, వ్యావహారిక జ్ఞానానికి సంబంధించిన వాణిని రికార్డ్ చేసి, దానిని సంకలన సంపాదకీయాలతో పుస్తక రూపంలో ప్రచురించటం జరుగుతుంది. వివిధ విషయాల మీద వెలువడిన అద్భుతమైన సారస్వత సంకలనాన్ని ఈ పుస్తకాలలో చూస్తారు. అవి కొత్తగా చేరిన పాఠకులకు కూడా ఒక వరంలా పనిచేస్తుంది.

ఈ అనువాదాలలో, స్వయంగా దాదాజీ వాణిలాగానే వినిపించే విధంగా ఉండేందుకు విశేష ప్రయత్నాలు జరిగాయి. ఈ కారణంగా కొన్ని సందర్భాలలో తెలుగు వ్యాకరణానికి భిన్నంగా ఉందనిపించవచ్చు. కానీ, దాని వెనుకనున్న లక్ష్యాన్ని పరిగణనలోకి తీసుకుంటే ప్రయోజనకరంగా ఉంటుంది.

ఈ పుస్తకంలో ఎన్నో చోట్ల నిఘంటువులలోని వాక్యాలు కాక, దాదాశ్రీ ఉపయోగించిన వ్యాక్యాలను ఎక్కువ స్పష్టత రావటం కోసం తీసుకుని రాయటం జరిగింది. అందువలన కొన్ని చోట్ల ఇంగ్లీషు పదాలనే దీనికి మూలమైన హిందీ పుస్తకంలో హిందీ పదాలలా రాయటం జరిగింది. అదే దాదాశ్రీ శ్రీముఖం నుంచి వెలువడిన గుజరాతీ మాటలనైతే యథాతథంగా ఇటాలిక్స్‌లో రాయటం జరిగింది. ఎందుకంటే, వాటికి సమానమైన, వాటి పూర్తి అర్థాన్నిచ్చే హిందీ పదాలు లేవు కనుక. కాకపోతే వాటికి దగ్గర్లో ఉన్న హిందీ పదాలను ఆ పుస్తకాలలో చివర్లో ఇచ్చారు.

ఒక జ్ఞాని వాక్యాలను హిందీలో అనువాదం చేయటానికి వారి వంతు ప్రయత్నం చేసామని చెప్తున్నారు. అదే ప్రయత్నం తెలుగులో కూడా జరిగింది. కాకపోతే దాదాశ్రీ అందించిన ఆత్మజ్ఞానాన్ని యథాతథంగా పొందాలంటే, దాన్ని గుజరాతీలో చదివితేనే ఆ పని పూర్తిగా జరుగుతుంది. జ్ఞానపు లోతులలోకి వెళ్ళాలంటే, ఆ వాక్యాలలోని మర్మాన్ని పూర్తిగా అవగతం చేసుకోవాలంటే గుజరాతీ భాషను నేర్చుకోమని మేమివ్వగల సలహా.

అనువాదంలోని లోపాలకు మమ్మల్ని క్షమించవలసిందిగా ప్రార్థన.

# సంపాదకీయం

లక్షలాదిమంది బద్రీ-కేదారనాథ్ యాత్రకు వెళ్ళారు, అకస్మాత్తుగా వచ్చిన హిమపాతం వలన వందలాది మంది దాని కింద నలిగి చనిపోయారు. ఇలాంటి వార్త విని ప్రతి ఒక్కరు కంపించిపోతారు, 'ఎంత భక్తి భావంతో భగవంతుని దర్శనం కోసం వెళ్లారు, అలాంటివాళ్ళనే భగవంతుడు అలా చంపేస్తాడా? భగవంతుడు చాల అన్యాయం చేస్తాడు! ఇద్దరు సోదరుల మధ్య ఆస్తి పంపకంలో ఒకడు ఎక్కువగా తీసుకుంటే, రెండవవాడికి తక్కువ వస్తుంది, అక్కడ బుద్ధి ఏది న్యాయం అని తరచిచూస్తుంది. చివరకు కోర్టు కచేరీలకు పోతారు, సుప్రీం కోర్టు వరకు కూడా పోరాడుతారు. ఫలితంగా ఇంకా ఎక్కువ దుఃఖానపడతారు. నిర్దోషి వ్యక్తి జైలు శిక్షను అనుభవిస్తాడు, తప్పుచేసినవాడు మజా చేసుకుంటూవుంటాడు. ఇందులో న్యాయం ఎక్కడుంది? నీతిమంతుడు దుఃఖపడుతుంటాడు. అవినీతిపరుడు బంగ్లా కట్టుకుంటాడు, బండిలో తిరుగుతాడు, ఇక అక్కడ న్యాయం ఎక్కడ కనపడుతుంది?

ఇలాంటి సంఘటనలు అడుగడుగునా కనపడతాయి. అక్కడ బుద్ధి 'న్యాయాన్ని' వెతికే పనిలో పడుతుంది, దుఃఖంలో ఉన్నవాడు దుఃఖంలోనే ఉండిపోతాడు. పరమ పూజ్య దాదాశ్రీ అద్భుత ఆధ్యాత్మిక ఆవిష్కరణ ఏమిటంటే, ఈ జగత్తులో ఎక్కడా అన్యాయమనేదే జరగదు. జరిగేది న్యాయమే! ప్రకృతి ఎప్పుడూ ధర్మాన్ని దాటి పోలేదు. ఎందుకంటే ప్రకృతి అంటే ఏ వ్యక్తిపైనయినా కాని లేక భగవానయినా కాని, వాళ్ళ మీద ఎవరి పెత్తనం చెల్లదు. ప్రకృతి అంటే సైంటిఫిక్ సర్కమ్‌స్టాన్షియల్ ఎవిడెన్స్. ఎన్ని రకాల సంయోగాలు ఏకమౌతేనో ఒక కార్యం పూర్తవుతుంది. అంతమందిలో కొందరు మాత్రమే ఎందుకు చనిపోయారు? ఎవరి ఖాతాలో మరణం రాసుందో వారే దుర్ఘటనపాలయ్యారు, మృత్యువాతపడ్డారు. ఎన్ ఇన్సిడెంట్ హాజ్ సో మెనీ కాజెస్ అండ్ ఎన్ ఏక్సిడెంట్ హాజ్ టూ మెనీ కాజెస్. రాసివుండకపోతే ఒక దోమ కూడా కుట్టదు. రాసివుండబట్టే దండన లభించింది. అందువలన విడుదలవాలని అనుకునేవారు అర్థం చేసుకోవలసింది ఏమిటంటే, తన విషయంలో జరిగిందంతా న్యాయమేనని.

‘ఏం జరిగిందో అదే న్యాయం’ అనే ఈ సూత్రాన్ని జీవితంలో ఎంతగా ఉపయోగించుకోగలిగితే, అంత శాంతి లభిస్తుంది, బయట ఎంత ప్రతికూల వాతావరణం ఉన్నప్పటికీ అణుమాత్రమైనా చలించడు.

జై సచ్చిదానంద

**–డా.నీరు బెహన్ అమీన్**

## దాదా భగవాన్ నిర్వచించిన

# "జరిగిందే న్యాయం"

### విశ్వం విశాలత్వం, శబ్దాతీతం

అన్ని శాస్త్రాలలో వర్ణించినంతే లేదు ఈ జగత్తు. శాస్త్రాలలో కొన్ని అంశాలే ఉన్నాయి. కానీ జగత్తు అవ్యక్తవ్యం, వర్ణనాతీతమైనది. భాషలో పెట్టగలిగేది కాదు. మరి మీరు దాన్ని భాషకి అతీతంగా ఎక్కడి నుంచి తీసుకునివస్తారు? భాషలోకి ఇమడనిదైతే దాని వర్ణన భాష లేకుండా ఎక్కడి నుండి అర్థం చేసుకోగలరు? జగత్తు ఇంత పెద్దది, విశాలమైనది. నేనేమో చూసున్నాను. కనుక మీకు నేను చెప్పగలుగుతాను ఎంత విశాలమైనదన్నది.

### ప్రకృతి ఎప్పుడూ న్యాయబద్ధమైనదే

ప్రకృతి న్యాయం ఏదైతే ఉందో, అందులో ఒక్క క్షణం కూడా అన్యాయమనేది జరగదు. ఈ ప్రకృతి ఒక్క క్షణమాత్రమైనా న్యాయంవీడేది కాదు. కోర్టులో జరగవచ్చు. కోర్టులో ఏదైనా నడుస్తుందేమో కాని, ప్రకృతి ఎప్పుడూ అన్యాయం జరగలేదు. ప్రకృతిలోని న్యాయం ఎలాంటిదంటే, మీరు ఒకవేళ మంచివారైయుండి, ఈ రోజే దొంగతనానికి వెళ్తే, మిమ్మల్ని పట్టించేస్తుంది. అదే చెడ్డ మనిషైతే మొదటి రోజున అతన్ని ఎంకరేజ్ (ప్రోత్సాహం) చేస్తుంది. ప్రకృతిలో

లెక్క ఎలా ఉంటుందంటే, మొదటి మనిషిని మంచిగానే ఉంచాలి కాబట్టి అతన్ని పట్టిస్తుంది కానీ సాయం చేయదు. రెండవ మనిషికి సాయం చేస్తూనేవుంటుంది, చివరకు ఎలాంటి దెబ్బ కొడుతుందంటే, అతను తిరిగి పైకి లేవనేలేవలేడు. అతను అధోగతిలో పోతాడు. ప్రకృతి ఒక్క నిమిషమైనా అన్యాయం చెయ్యదు. నన్ను అడుగుతుంటారు, మీ కాలికి ఫ్రాక్చర్ అయింది అదేమిటి మరి? అని. ఇదంతా ప్రకృతి చేసిన న్యాయమే.

'ఏం జరిగిందో అదే న్యాయం' అని ప్రకృతి న్యాయాన్ని అర్థం చేసుకుంటే మీరు ఈ జగత్తు నుండి విముక్తులౌతారు. అలా కాకుండా మీరు ప్రకృతిని ఏమాత్రమైనా అన్యాయం చేసేదిగా భావిస్తే, అదే మీకు ఈ జగత్తులో కష్టాలకు కారణమౌతుంది. ప్రకృతి న్యాయపరమైనదని నమ్మటమే జ్ఞానం. 'ఎలా ఉంటే అదే సరి' అని తెలుసుకోవటమే జ్ఞానం, 'ఎలా ఉందో అదే సరి' అని తెలుసుకోక పోవటం అజ్ఞానం.

ఒక మనిషి మరో మనిషి దుకాణాన్ని తగలబెట్టాడు. అలాంటి సమయంలో ఎవరైనా, 'భగవాన్ ఇదేమిటి? ఈ మనిషి దుకాణాన్ని అతను తగలబెట్టాడు. ఇది న్యాయమా, అన్యాయమా?' అని అడిగితే, 'న్యాయమే. తగులబెట్టటమే న్యాయం' అని అంటారు. ఇక ఆ విషయంలో, 'అతను పనికిరానివాడు, ఇలాంటివాడు, అలాంటివాడు' అని అతన్ని నిందిస్తుంటే, అతనికి అన్యాయ ఫలం లభిస్తుంది. అతను న్యాయాన్నే అన్యాయం అంటున్నాడు! జగత్తు అంతా న్యాయస్వరూపమైనదే. క్షణమాత్రం కూడా ఇందులో అన్యాయం లేదు.

జగత్తులో న్యాయాన్ని వెతకటం వలనే ఈ ప్రపంచంలో పోరాటాలు జరిగాయి. జగత్తు న్యాయస్వరూపమే కనుక, జగత్తులో న్యాయాన్ని వెదకనేవద్దు. ఏం జరిగిందో అదే న్యాయం. ఎలా జరిగిపోయిందో అదే న్యాయం. ఈ కోర్టులు అవీ ఎందుకు తయారయ్యాయంటే, న్యాయాన్ని శోధించటానికి! అరె భాయ్, న్యాయం జరిగివుండవచ్చు! దానికి బదులు 'ఏం జరిగింది' అన్నది చూడు. అదే న్యాయం.

'న్యాయ' స్వరూపం వేరు, మనకు అందిన ఫలస్వరూపం వేరు. న్యాయాన్యాయాల ఫలితం మన ఖాతా లెక్కల్లోంచే వస్తుంది. మనమేమో దానికి 'న్యాయం' అనేది జాయింట్ చేయటానికి పోతాం. మరి కోర్టుకి వెళ్ళవలసిందే కదా! ఇక అక్కడికి పోయి అలసిపోవటం, చివరకు వెనక్కి రావటం జరుగుతుంది.

ఎవరికైనా మీరు ఒక తిట్టు తిడితే అతను మిమ్మల్ని రెండు మూడు తిట్లు తిడతాడు. ఎందుకంటే అతని మనసులో మీమీద కోపం వచ్చేస్తుంది. అప్పుడు అందరూ ఏమంటారు? నువ్వు మూడు తిట్లు ఎందుకు తిట్టారు? అతను ఒక తిట్టే తిట్టాడు కదా! ఇక అందులో న్యాయం ఏమిటి? ఖాతాలో అతను మనకి మూడు తిట్లే తిట్టే లెక్క ఉంది. పూర్వపు లెక్కలను తీర్చుకోవాలా వద్దా?

**ప్రశ్నకర్త :** ఔను తీర్చుకుంటాడు.

**దాదాశ్రీ :** వసూలు చేసుకుంటారా లేదా? మీరు అతని తండ్రికి ఒక రూపాయి అప్పు ఇచ్చి, తిరిగి అవకాశం వచ్చినపుడు వసూలుచేసుకుంటారా లేదా? కానీ అతను, మీరు అన్యాయం చేస్తున్నారని అనుకుంటాడు. అలాగే ప్రకృతి న్యాయం ఏమిటి? పూర్వపు ఖాతానంతటినీ సమీకరిస్తుంది. ఇప్పుడు స్త్రీ ఎవరైనా భర్తని వేధిస్తున్నదనుకోండి, అది ప్రకృతి న్యాయం. ఆమె భర్త, 'ఆమె చాల చెడ్డది' అని అనుకుంటాడు. ఆమె, 'తన భర్త చెడ్డవాడు' అనుకుంటుంది. కానీ, ఇది ప్రకృతి న్యాయం.

**ప్రశ్నకర్త :** ఔను.

**దాదాశ్రీ :** మీరు ఫిర్యాదు చేయటానికి వస్తే నేను వినను. అందుకు కారణమేమిటి?

**ప్రశ్నకర్త :** ఇప్పుడు అర్థమైంది అది న్యాయమని.

## అల్లినదాన్ని విప్పుతుంది ప్రకృతి

**దాదాశ్రీ :** ఇదంతా మనం కనిపెట్టిందే కదా! అనుభవించేదంతా

తన తప్పు వలనే. చూడండి ఎంత మంచి ఆవిష్కరణో. ఎవరితోనూ ఘర్షణలోకి రాకండి, వ్యవహారంలో న్యాయానికి వెదకకండి.

నియమం ఏమిటంటే, మీరు ఏ విధంగా అల్లుతారో, మళ్ళీ అదే క్రమంలోనే దాన్ని విప్పటం కుదురుతుంది. అన్యాయపూర్వకంగా అల్లినట్లయితే అన్యాయంతో విప్పటం, న్యాయంగా అల్లినట్లయితే, దాన్ని న్యాయంగా విప్పటం జరుగుతుంది. అలా అల్లుకున్నదంతా విప్పుకుంటోంది, మనుషులు అందులో న్యాయాన్ని వెతుకుతున్నారు. బాబూ, న్యాయాన్ని ఎందుకు వెతుకుతున్నారు కోర్టు లాగా. అరె, బాబూ, మీరు అన్యాయపూర్వకంగా అల్లారు, ఇప్పుడు న్యాయపూర్వకంగా విప్పటానికి వెళ్తున్నారా? అదెలా సంభవం? అది తొమ్మిదితో గుణించబడింది. నేను తొమ్మిదితో భాగహారం చేద్దామనుకుంటేనే నేను నా మూల స్థానానికి రాగలుగుతాను. అల్లుకున్న చిక్కుముడులు ఎన్నో ఉన్నాయి. కనుక ఈ నా వాక్యాలను పట్టుకుంటే వాళ్ళ పని తీరిపోతుంది కదా!

**ప్రశ్నకర్త :** ఔను దాదా, ఈ రెండు మూడు పదాలను పట్టుకుంటే చాలు, అతను జిజ్ఞాసువు అయినట్లయితే అతని పని నెరవేరుతుంది.

**దాదాశ్రీ :** పని నెరవేరుతుంది. అధిక తెలివితేటలు చూపించకపోతే పని నెరవేరుతుంది.

**ప్రశ్నకర్త :** వ్యవహారంలో 'నువ్వు న్యాయాన్ని వెతకకు', 'ఎవరి తప్పులకు వారు అనుభవిస్తారు' ఈ రెండు సూత్రాలను పట్టుకున్నాను.

**దాదాశ్రీ :** 'న్యాయాన్ని వెతకకు' ఈ వాక్యాన్ని పట్టుకునివుంటే అంతా ఆల్‌రైట్ అవుతుంది. వీళ్ళంతా న్యాయాన్ని వెతుకుతుంటారు. అందుకే అన్ని చిక్కులు ఎదురౌతుంటాయి.

## పుణ్యోదయంతో హంతకుడు కూడా నిర్దోషిగా తప్పించుకుంటాడు

**ప్రశ్నకర్త :** ఏ వ్యక్తయినా ఖూనీ చేసినా, దాన్ని కూడా న్యాయమనే అంటారా?

**దాదాశ్రీ :** న్యాయానికి అతీతంగా ఏదీ లేదు. భగవాన్ భాషలో న్యాయమే అనిపించుకుంటుంది. సర్కారీ భాషలోను అనిపించుకోదు, లౌకకంగాను అనిపించుకోదు. లౌకికంగా, ఖూని చేసిన మనిషినే పట్టుకునివచ్చి, ఇతనే దోషి అంటారు. మరి భగవాన్ భాషలో ఏమంటారు? 'ఎవరి హత్య జరిగిందో అతనే దోషి' అని. 'హత్య చేసినవాడి తప్పేమీ లేదా?' అని అడిగితే, 'హత్య చేసినతను దొరికితే అప్పుడు అతను దోషిగా పరిగణింపబడతాడు. ఇప్పుడు అతను దొరకలేదు ఇతను పట్టుబడ్డాడు! మీకు అర్థమౌతోందా?

**ప్రశ్నకర్త :** ఎవరైనా వ్యక్తి హత్య చేసి కోర్ట్‌లో నిర్దోషిగా వదిలివేయబడతాడో, అతడు పూర్వ కర్మకి ప్రతీకారం తీర్చుకుంటున్నట్లా లేక తన పుణ్యం వలన అలా వదిలివేయబడతాడా? అది ఏమిటి?

**దాదాశ్రీ :** పుణ్యం, పూర్వ కర్మకి ప్రతీకారం, రెండూ ఒకటే. అతని పుణ్యం వలన అతను విడుదలయ్యాడు. ఏ నేరం చెయ్యకపోయినా ఇరుక్కుంటాడు. జైలుకి వెళ్ళవలసివస్తుంది. అది అతని పాపం వలన జరిగేది. అక్కడ వేరే దారేమీ ఉండదు.

ఇకపోతే, ఈ ప్రపంచంలోని కోర్టులో అన్యాయం జరగవచ్చునేమోకాని, ప్రకృతి ఈ ప్రపంచంలో ఎప్పుడూ అన్యాయం చెయ్యలేదు. న్యాయబద్ధంగానే ఉంటుంది. ప్రకృతి న్యాయానికి అతీతంగా ఎప్పుడూ పోనేలేదు. తుఫాను ఒకటి వచ్చినా లేక రెండు వచ్చినా, న్యాయం ప్రకారమే జరుగుతుంది.

**ప్రశ్నకర్త :** మీ దృష్టిలో వినాశనం చేసే దృశ్యం ఏదైతే ఉంటుందో, అది మనకి శ్రేయోదాయకమా?

**దాదాశ్రీ:** వినాశం కలుగుతూ కనిపిస్తే అది శ్రేయోదాయకం ఎలా అవుతుంది? కానీ జరిగే వినాశం నియమం ప్రకారం సరైనదే. ప్రకృతి వినాశం కలిగిస్తుందంటే అదీ సరైనదే, ఎవరి పోషణైనా చేస్తుందంటే అదీ సరైనదే. అంతా రెగ్యులర్‌గా చేస్తుంది. ఆన్ ద స్టేజ్! మనుషులు తన స్వార్థం దృష్ట్యా ఆరోపణలు చేస్తుంటారు, 'నా పంటంతా కాలిపోయింది' అని. చిన్న పంట వేసినతను, 'నా విషయంలో మంచే జరిగింది' అంటాడు. అంటే ప్రతివారు తమ తమ స్వార్థం పాటే పాడుతుంటారు.

**ప్రశ్నకర్త:** ప్రకృతి న్యాయమే చేస్తుందని మీరంటున్నారు. మరి ఈ భూకంపాలు వస్తుంటాయి, తుఫాన్లు వస్తుంటాయి, అధిక వర్షపాతం వస్తుంది, అదెందుకు మరి?

**దాదాశ్రీ :** అదంతా న్యాయమే చేస్తోంది. వర్షం పడితే పంట పండుతుంది. అదంతా న్యాయమే జరుగుతోంది. భూకంపం వస్తుందంటే అది కూడా న్యాయంగా జరుగుతోంది.

**ప్రశ్నకర్త:** అదెలా?

**దాదాశ్రీ:** ఎంతమంది తప్పులు చేస్తే, వాళ్ళనే పట్టుకుంటుంది కాని ఇతరులను కాదు. ఈ తప్పులు చేసినవారినే పట్టుకుంటుంది. జగత్తు ఏమాత్రం డిస్టర్బ్ కాలేదు. ఒక్క సెకండు కూడా న్యాయానికి అతీతంగా పోదు.

## జగత్తులో పాము, దొంగల అవసరం ఉంది

నన్ను అడుగుతుంటారు, 'దొంగలు ఎందుకు తయారైవస్తారు?' అని. ఈ జేబు దొంగల అవసరమేముంది? భగవాన్ వీళ్ళని ఎందుకు పుట్టించివుంటాడు? అరె, వాళ్ళే లేకపోతే నీ జేబులను ఎవరు ఖాళీచేస్తారు? భగవాన్ స్వయంగా వస్తారా ఏమిటి? మీ దొంగ సొమ్మును ఎవరు పట్టుకుంటారు? మీ నల్ల ధనాన్ని ఎవరు తీసుకునిపోతారు? వాళ్ళు పాపం నిమిత్తమాత్రులు. కనుక, వీళ్ళందరి అవసరం ఉంది.

**ప్రశ్నకర్త :** చెమటోడ్చి సంపాదించింది కూడా పోతుంది.

**దాదాశ్రీ :** అది ఈ జన్మలో చెమటోడ్చి సంపాదించింది. కానీ పాత బాకీ అంతా ఉంది కదా! బైఖాతాలో బాకీ ఉంది అందుకే! లేకపోతే ఎవరూ మనదేమీ తీసుకుని పోలేరు. ఎవరి దగ్గరి నుంచైనా తీసుకోగల శక్తి లేదు. ఒకవేళ తీసుకునిపోతే అది మన పూర్వ, భవిష్యత్తుల లెక్కల్లోకి వస్తుంది. ఎవరి నుంచైనా ఏమైనా తీసుకునిపోగలవాడు ఇంతవరకు ఎవరూ పుట్టలేదు. అంత నియమబద్ధమైనది ఈ జగత్తు. చాల నియమబద్ధమైన జగత్తు ఇది. ఇక్కడ కింద అంతా పాములతో నిండిపోయి ఉన్నా, పాము మనలను ముట్టుకోలేదు. అంత నియమబద్ధమైన జగత్తు ఇది. అన్నీ లెక్క ప్రకారం చేసే జగత్తు. ఈ జగత్తు ఎంతో సుందరమైనది, న్యాయస్వరూపం. కానీ మనుషులకు అది అర్థం కావటం లేదు.

## కారణం తెలుసుకో, పరిణామం కాదు

ఇదంతా రిజల్ట్. పరీక్షల రిజల్ట్స్ వస్తుంటాయి కదా, గణితంలో వందకి తొంభైఐదు మార్కులు వచ్చాయి, ఇంగ్లీషులో వందకి ఇరవై ఐదు మార్కులు వచ్చాయంటూ. మనం ఎక్కడ తప్పు చేసామో తెలియదా మనకి? ఈ పరిణామంతో మనకి అర్థమౌతుంది కదా ఏ కారణంతో తప్పు దొర్లింది అని? ఈ సంయోగాలన్నీ ఒక దగ్గర కూడినపుడు అవన్నీ పరిణామాలౌతాయి. ఆ పరిణామాలతోనే మనకి కాజ్ అర్థమౌతుంది.

ఇక్కడ రోడ్డు మీద జనం అటు ఇటు నడుస్తుంటే, వెదురు ముల్లు ఒకటి తిన్నగా పడివుంటే, చాలమంది తిరుగుతున్నప్పటికీ ముల్లు ఎలా ఉన్నది అలాగే ఉంటుంది. మీరు సాధారణంగా చెప్పులో బూట్లో వేసుకోకుండా రోడ్డు మీద నడవరు కానీ, ఆరోజు ఎవరి ఇంటికో వెళ్తే, 'దొంగ దొంగ' అంటూ కేకలు వినిపిస్తే ఒట్టి కాళ్ళతోనే బయటకు పరిగెత్తారు, అప్పుడు ఆ ముల్లు మీకు గుచ్చుకుంటే అది మీ ఖాతాలో ఉన్నదే, అది కూడా గుచ్చుకుని, ఇటు నుంచి అటు వచ్చేసింది. మరి ఈ సంయోగాలను పేర్చింది ఎవరు? 'వ్యవస్థిత శక్తి' (సైంటిఫిక్ సర్కమ్‌స్టాన్షియల్ ఎవిడెన్స్) ఒక దగ్గరికి చేర్చింది.

# ప్రకృతి ధర్మం

ముంబై ఫోర్ట్ ఏరియాలో మీ బంగారపు చైన్ ఉన్న గడియారం పోయినట్లయితే, ఇంటికి వచ్చిన తర్వాత, 'ఇక అది చేతికి చిక్కదు' అని నిర్ధారణ చేసుకుంటారు. కానీ రెండు రోజుల తర్వాత పేపర్లో, 'ఈ గడియారం ఎవరిదో వాళ్ళు అందుకు తగ్గ ప్రమాణపత్రాన్ని చూపించి, ఈ ప్రకటనకు అయిన ఖర్చుని చెల్లించి తీసుకునివెళ్ళవచ్చును' అని ఒక ప్రకటన పడిందనుకోండి. దాని అర్థం, వస్తువు ఎవరికి చెందుతుందో దాన్ని వారు తప్ప వేరెవరూ తీసుకోలేరు. అది అతనికి చెందకపోతే అతనికి దొరకదు. ప్రకృతి ఎంత నియమబద్ధమైనదంటే, ఒక్క పర్సెంటు కూడా వెనకా ముందూ కాదు. కోర్టు ఎలాంటిదైనా కావొచ్చు, అది కలియుగం మీద ఆధారపడివున్నది. కానీ ఈ ప్రకృతి నియమం మీద ఆధారపడివున్నది. కోర్టు చట్టాలను అతిక్రమిస్తే కోర్టు ప్రకారం నేరస్తుడవౌతావు కానీ ప్రకృతి నియమాలను అతిక్రమించవద్దు.

## ఉన్నదంతా మీ ప్రొజెక్షనే

ఈ ప్రొజెక్షన్ అంతా మీదే. ఇతరులకు దోషాన్నెందుకు అంటగడతావు?

**ప్రశ్నకర్త :** క్రియకి ప్రతిక్రియా ఇది?

**దాదాశ్రీ :** దీన్ని ప్రతిక్రియ అనరు. కానీ ఇదంతా మీ ప్రొజెక్షనే. ప్రతిక్రియ అని అంటే, 'యాక్షన్ అండ్ రియాక్షన్ ఆర్ ఈక్వల్ అండ్ ఆపోజిట్' అవుతుంది.

ఇక్కడ ఉదాహరణనిస్తున్నాం. ఒక సిమిలిని ఇస్తున్నాం. మీ ప్రొజెక్షన్ ఇది. వేరెవరి చేయి ఇందులో లేదు కనుక, మీరు చాల జాగరూకతతో, ఇది నా బాధ్యత అని అనుకోవాలి. బాధ్యతని అర్థం చేసుకున్న తర్వాత ఇంట్లో మీ ప్రవర్తన ఎలా ఉండాలి?

**ప్రశ్నకర్త :** అలా ప్రవర్తించాలి.

**దాదాశ్రీ :** ఔను. మీ బాధ్యతను మీరు అర్థం చేసుకోవాలి. లేకపోతే, 'భగవాన్ మీద భక్తి ఉంటే అన్నీ తొలగిపోతాయి' అంటారు. అంతా మోసం. భగవాన్ పేరుతో మనుషులు మోసాలు చేస్తున్నారు. బాధ్యతేమో మీది. హోల్ అండ్ సోల్ రెస్పాన్సిబుల్. మీ ప్రొజెక్షనే కదా!

ఎవరైనా దుఃఖం కలిగిస్తే దాన్ని జమ చేసుకోండి. నువ్వు అంతకు ముందు ఇచ్చివుంటావు, దాన్నే తిరిగి జమ చేసుకుంటున్నావు. ఎందుకంటే, కారణం లేకుండా ఎవరైనా బాధ కలిగించటమనే చట్టమే ఇక్కడ లేదు. దాని వెనుక కాజ్ ఉండివుండాలి. అందుకే జమచేసుకోండి.

## ఎవరైతే ఈ జగత్తు నుండి విడుదలై పోవాలో, వారు...

ఇక ఎప్పుడైనా పప్పులో ఉప్పు ఎక్కువైతే అదీ న్యాయమే.

**ప్రశ్నకర్త :** ఏం జరుగుతున్నదో చూడమని అన్నారు మీరు. దాన్నే చూడాలి. అంటే న్యాయం చెయ్యాలనే ప్రశ్న ఎక్కడుంది?

**దాదాశ్రీ :** న్యాయమా, నేను దాని గురించి వేరుగా చెప్తాను. చూడు, అతని చేతికి కాస్త కిరోసిన్ అంటుకునివుంటుంది. అదే చేత్తో లోటాని తీసుకుని వుండవచ్చు. అందుకే కిరోసిన్ వాసన వస్తుంది. నేను నీళ్ళు తాగటానికి పోతే కిరోసిన్ వాసన వచ్చింది. అలాంటప్పుడు ఏం జరిగిందో మనకి 'కనిపిస్తుంది, అర్థమౌతుంది.' అలాంటప్పుడు ఏది న్యాయం? మన వంతుకి అది ఎందుకు వచ్చింది? అంతకు ముందు ఎప్పుడూ రాలేదు కదా ఈ రోజు ఎక్కడి నుంచి వచ్చింది? అంటే, 'ఇది మన లెక్కలో ఉన్నదే. కనుక ఆ లెక్కని పూర్తి చెయ్యి'. కాని అది ఏవిధంగా పూర్తిచేస్తానంటే అది ఎవరి దృష్టికీ రాదు. ఉదయం లేచిన తర్వాత ఆమె మళ్ళీ వచ్చి అవే నీళ్ళు ఇస్తే దాన్ని మళ్ళీ తాగేస్తాను. కానీ ఎవరికీ ఈ విషయం తెలియదు. అదే స్థానంలో ఒక అజ్ఞాని ఏం చేస్తాడు?

**ప్రశ్నకర్త :** పెద్ద దుమారం లేపుతాడు.

**దాదాశ్రీ :** ఇంటివాళ్ళందరికీ అర్థమౌతుంది, ఈ రోజు సేఠ్‌జీ నీళ్ళల్లో కిరోసిన్ ఉందని.

**ప్రశ్నకర్త :** ఇల్లంతా ఏకమౌతుంది.

**దాదాశ్రీ :** అరె, అందరికీ పిచ్చెక్కించేస్తుంది! ఇక పాపం ఆ ఇల్లాలు టీలో పంచదార వెయ్యటం మర్చిపోతుంది. ఒకసారి గందరగోళం ఏర్పడితే ఇక అన్నిటిలోను గందరగోళమే.

**ప్రశ్నకర్త :** దాదా, ఇందులో మీరు చెప్పింది నిజమే. మనం ఫిర్యాదు చెయ్యకుండా శాంతచిత్తంతో ఇంటివాళ్ళకి చెప్పాలి, 'నీళ్ళలో కిరోసిన్ పడింది. జాగ్రత్తగా చూసుకో' అని.

**దాదాశ్రీ :** అది ఎప్పుడు చెప్పాలి, ఫలహారం తీసుకుంటున్నప్పుడు సరదాగా మాట్లాడుకుంటున్నప్పుడు, అందరితోనూ నవ్వుతూ మాట్లాడవచ్చు.

ఇప్పుడు ఆమెకి ఈ సంగతి చెప్తున్నాం కదా, అలాగే అదే మాట మరోసారి సరదాగా మాట్లాడుకుంటున్నప్పుడు చెప్పవచ్చు.

**ప్రశ్నకర్త :** ఎదుటివారు నొచ్చుకోకుండా చెప్పాలి కదా!

**దాదాశ్రీ :** ఔను. అలా చెప్పినట్లయితే అది ఎదుటివారికి హెల్ప్ అవుతుంది. కానీ, అన్నిటికన్నా మంచి మార్గం ఏమిటంటే, నువ్వు ఏం మాట్లాడవద్దు, నేనూ ఏమీ మాట్లాడను. దాన్ని మించింది మరేమీ లేదు. ఎందుకంటే, ఈ ప్రపంచం నుంచి విడుదలవాలనుకునేవారు, ఏమాత్రం ఫిర్యాదులు చెయ్యకూడదు.

**ప్రశ్నకర్త :** సలహా ఇచ్చినట్లు కూడా చెప్పవద్దా? అక్కడ మౌనంగానే ఉండాలా?

**దాదాశ్రీ :** ఆమె లెక్కలన్నీ వెంట తెచ్చుకునేవుంది. ఎలా తెలివిని పెంచుకోవాలన్నది కూడా ఆమె తన వెంటే తెచ్చుకుంది.

నేను చెప్పేదేమిటంటే, ఇక్కడి నుంచి విడుదలై పారిపో. అలా పారిపోవాలంటే ఏమీ మాట్లాడవద్దు. రాత్రిపూట పారిపోవాలంటే గోల చేసుకుంటే పట్టుకుంటారు కదా?

## భగవాన్ దగ్గర ఎలా ఉంటుంది?

భగవాన్ ది న్యాయస్వరూపమూ కాదు, అన్యాయస్వరూపమూ కాదు. ఎవరికీ దుఃఖాన్ని కలిగించనిదే భగవాన్ భాష. న్యాయం, అన్యాయం అనేది లౌకికమైన భాష.

దొంగ, దొంగతనం చెయ్యటమే ధర్మమని అనుకుంటాడు. దాత, దానం చెయ్యటమే ధర్మమని అనుకుంటాడు. ఇది లౌకికమైన భాషే కాని భగవాన్ భాష కాదు. భగవాన్ దగ్గర అలాంటిదేమీ లేదు. భగవాన్ దగ్గర ఉన్నదంతా, 'ఏ జీవికీ బాధ కలిగించకుండా ఉండటమే నా ఆజ్ఞ' అనే.

న్యాయాన్యాయాలను ప్రకృతే చూసుకుంటుంది. ఇక ఇక్కడ ప్రపంచంలో ఉన్న న్యాయాన్యాయాలు శత్రువులకు, నేరస్తులకే హెల్ప్ చేస్తుంది. 'ఏదో పాపం వదిలేయండి' అంటారు. అప్పుడు నేరస్తుడు కూడా తప్పించుకుంటాడు. 'అలాగే అవుతుంది' అంటారు. కానీ, ప్రకృతి ధర్మంలో వేరే దారే ఏమీ ఉండదు. అందులో ఎవరి మాటా చెల్లదు.

## తన సొంత తప్పిదాలే అన్యాయాన్ని చూపిస్తాయి

కేవలం తన దోషాలవలనే ప్రపంచమంతా నియమం తప్పినట్లుగా కనిపిస్తుంది. ఒక్క క్షణమాత్రం కూడా నియమం తప్పి లేదు. పూర్తిగా న్యాయ బద్ధంగానే ఉంటుంది. ఇక్కడ కోర్టు న్యాయం మారవచ్చు. ఆ తప్పు తప్పిపోవచ్చు. కాని ప్రకృతి ధర్మంలో తేడా ఉండదు.

**ప్రశ్నకర్త :** కోర్టు న్యాయం కూడా ప్రకృతి ధర్మమేనా, కాదా?

**దాదాశ్రీ :** అదంతా ప్రకృతిలోనిదే. కానీ మనకి కోర్టులో ఈ జడ్జ్ ఇలా చేసాడు అనిపిస్తుంది. ప్రకృతిలో అలా అనిపించదు కదా. కానీ అది బుద్ధి సందిగ్ధావస్థ.

**ప్రశ్నకర్త :** మీరు ప్రకృతి ధర్మాన్ని కంప్యూటర్‌తో పోల్చి చెప్పారు. కానీ కంప్యూటర్ మెకానికల్ కదా.

**దాదాశ్రీ :** వివరించి చెప్పటానికి మరో సాధనం లేదు కదా. అందువలన నేను ఆ సిమిలిని ఉపయోగించాను. ఇకపోతే కంప్యూటర్ అనేది చెప్పుకోవటానికే. కంప్యూటర్‌లో డేటాని ఫీడ్ చేస్తారు. అలాగే ఇందులో తన సొంత భావనలు పొందుపరుస్తాం. అంటే, ఒక జన్మలోని భావకర్మ పడిన తర్వాత, మరు జన్మలో దాని పరిణామం వస్తుంది. అప్పుడు దాని విసర్జన జరుగుతుంది. అది ఈ 'వ్యవస్థిత శక్తి' నియంత్రణలో ఉంటుంది. అది 'ఎగ్జాక్ట్' న్యాయమే చేస్తుంది. ఏది న్యాయమో అదే చేస్తుంది. మీరు మీ అబ్బాయిని చంపేసారు అంటే, న్యాయంలో అలా ఉండబట్టే. అయినా అది న్యాయమే అనిపించుకుంటుంది. ఎందుకంటే, తండ్రి కొడుకుల మధ్య లెక్క ఏదైతే ఉందో దాని ప్రకారమే జరిగింది. ఇందులో లెక్క తేలటమే జరుగుతుంది కాని మరేమీ కాదు కదా.

పేదవాడు ఎవరైనా లాటరీలో ఒక లక్ష రూపాయలను గెలుచుకుంటే, అది న్యాయమే, ఎవరిదైనా జేబు కత్తిరించబడితే అదీ న్యాయమే.

## ప్రకృతి ధర్మానికి ఆధారం ఏమిటి?

**ప్రశ్నకర్త :** ప్రకృతి ధర్మబద్ధమైనదనటానికి ఆధారం ఏమిటి? న్యాయబద్ధమైనదని చెప్పటానికి ఏమైనా ఆధారం ఉండాలి కదా?

**దాదాశ్రీ :** అది న్యాయబద్ధమైనదే. దాన్ని మీరు తెలుసుకోవాలి అంతే. అది న్యాయబద్ధమైనదనే నమ్మకం మీకు కలుగుతుంది. కానీ బయటివారికి (అజ్ఞానం వలన) ఆ నమ్మకం కలుగదు. ఎందుకంటే వాళ్ళకి ఆ దృష్టి లేదు కదా. (మీరు ఆత్మజ్ఞానం పొందారు, కానీ వాళ్ళ దృష్టి ఇంకా సమ్యక్ కాలేదు కనుక).

నేను చెప్పదలచుకున్నదేమిటి? ఆఫ్టరాల్ జగత్తు అంటే ఏమిటి? అది ఇలాంటిది– అణువంతయినా తేడా కలుగనీయనంత న్యాయస్వరూపమైనది, పూర్తిగా న్యాయబద్ధమైనది.

ప్రకృతి రెండు పదార్థాలతో తయారైంది. ఒకటి స్థాయి– సనాతన వస్తువు, రెండవది అస్థాయి వస్తువు– అవస్థా రూపంలో ఉన్నది. దాని అవస్థ మారుతూ వుంటుంది. అది నియమానుసారం మారుతుంటుంది. చూసేవాడు తనదైన (ఏకాంతిక్) బుద్ధితో చూస్తాడు కాని, అనేకాంత దృష్టితో ఆలోచించడు. తన స్వార్థంతోనే చూస్తాడు.

ఒకే ఒక్కడు కొడుకు, వాడు చనిపోయాడనుకుందాం, అదీ న్యాయమే. అందులో ఎవరూ అన్యాయమేమీ చెయ్యలేదు. ఇందులో భగవాన్‌ది కాని, మరెవరిదీ కూడా అన్యాయమనేది లేదు. న్యాయమే ఉంది. అందుకే, జగత్తు న్యాయస్వరూపమని అంటాను. నిరంతరం న్యాయస్వరూపంలోనే ఉంటుంది.

ఒకానొక్క కొడుకు చనిపోతే, దుఃఖించేది ఆ ఇంటివాళ్ళు మాత్రమే. చుట్టుపక్కలవాళ్ళంతా ఎందుకు ఏడవరు? ఆ ఇంటివాళ్ళు కేవలం తమ స్వార్థం వలనే దుఃఖిస్తారు. అదే సనాతన వస్తువులో (తన ఆత్మ స్వరూపంలో) కి వస్తే అది ప్రకృతి న్యాయమే అవుతుంది.

ఈ మాటలన్నిటి మధ్య పొంతన కనిపిస్తుందా? పొంతన కనిపిస్తే అది సరైనదని తెలుసుకోండి. జ్ఞానాన్ని అమలులో పెడితే దుఃఖాలు ఎంత తగ్గిపోతాయో!

ఒక్క సెకండు కూడా న్యాయంలో తేడా రాదు. అన్యాయం చేసేవాడు మోక్షంలోకి పోనేపోడు. మంచివాళ్ళకే కష్టాలెందుకు వస్తాయి అని అడుగుతారు. కానీ ఎవరూ అలాంటి కష్టాలను కలిగించలేరు. ఎందుకంటే మీరుగా ఏ విషయంలోను కలుగజేసుకోకపోతే, మీ పేరెత్తే శక్తి ఎక్కడా లేదు. మీరే కలుగజేసుకున్నారు కాబట్టే మీకు అదంతా ఎదురైంది.

## ప్రాక్టికల్ కావాలి కాని, థీరీ వద్దు

శాస్త్రవేత్తలు ఏం చెప్తారు? 'జరిగిందే న్యాయం' అనైతే చెప్పరు. 'న్యాయమే న్యాయం' అని చెప్తారు. అరె బాబు, మీలాంటివాళ్ళ వలనే మేము ఇంకా దారితప్పి ఇక్కడే తిరుగుతున్నాం. అంటే, థీరిటికల్లీ చెప్తారు, 'న్యాయమే న్యాయం' అని. కానీ ప్రాక్టికల్‌గా చెప్పేదేమిటంటే, జరిగిందే న్యాయం. ప్రాక్టికల్ లేకుండా ఈ లోకంలో ఏ పనీ జరగదు. అందుకే ఈ థీరిటికల్ నిలబడలేదు.

అంటే, ఏం జరిగిందో అదే న్యాయం. నిర్వికల్పులవాలి, జరిగిందే న్యాయం అనుకోవాలి. వికల్పి కావాలనుకుంటే న్యాయాన్ని వెతుకు. భగవాన్ అవాలనుకుంటే, ఏం జరిగిందో అదే న్యాయం. మరి దారితప్పి తిరుగుతూ వుండాలనుకుంటే, న్యాయాన్ని వెతుక్కుంటూ తిరుగుతూనేవుండు.

## నష్టం, లోభిని నొచ్చుకునేటట్లుగా చేస్తుంది

ఈ ప్రపంచం అర్థం లేనిది కాదు. ప్రపంచం న్యాయస్వరూపమైనది. ప్రకృతి ఎప్పుడూ ఏమాత్రం అన్యాయం చెయ్యలేదు. ప్రకృతి ఒకచోట మనిషిని కాటువేస్తుంది, యాక్సిడెంట్ అవుతుంది అంటే అది న్యాయస్వరూపమే. ప్రకృతి న్యాయం దాటి పోలేదెప్పుడూ. ఒట్టిగా అజ్ఞానంతోనే అలా చెప్తుంటారు, జీవించే కళ కూడా అలాంటివాళ్ళకి రాదు, చూడిక చింతే చింత. అందువలన జరిగింది ఏదైతే ఉందో దాన్ని న్యాయం అను.

మీరు ఒక దుకాణమతనికి వంద రూపాయల నోటు ఇస్తే, అతను ఐదు రూపాయల విలువైన సరుకు మీకిచ్చి, ఐదు రూపాయలు మీకు తిరిగిచ్చాడనుకుందాం. అక్కడి సందోహంలో తొంభై రూపాయలు ఇవ్వటం మర్చిపోయాడు. అతని దగ్గర ఎన్నో వంద రూపాయల నోట్లు, పది రూపాయల నోట్లు లెక్కలేకుండా ఉన్నాయి. అతను పొరపాటున మీకు ఐదు రూపాయలు ఇస్తుంటే మీరేమంటారు? 'నేను మీకు వంద రూపాయలు ఇచ్చాను!' అంటారు అతను 'లేదు' అంటాడు. అతనికి అంతే జ్ఞాపకం ఉంది. అతను అబద్ధమాడే మనిషి కాదు. అలాంటప్పుడు మీరేం చేస్తారు?

**ప్రశ్నకర్త :** కానీ, అన్ని రూపాయలు పోయాయే అని మనసులో గుచ్చుకుంటూవుంటుంది. మనసు గోలపెడుతుంటుంది.

**దాదాశ్రీ :** గుచ్చుకుంటుందీ అంటే, ఎవరి మనసులో గుచ్చుకుంటూ వున్నదో అతనికి నిద్రపట్టదు. 'నాకు' (శుద్ధాత్మకి) ఏమౌతుంది? ఈ శరీరంలో ఎవరైతే బాధపెట్టుకున్నారో వాళ్ళకి నిద్రపట్టదు. అందరికీ బాధ కలుగదు కదా? లోభికే బాధ పట్టుకుంటుంది. అప్పుడు ఆ లోభితో, 'గుచ్చుకుంటూవుందా? అయితే పడుకుని నిద్రపోండి! ఇక ఇప్పుడు రాత్రంతా నిద్రపోవలసిందే కదా?' అనండి.

**ప్రశ్నకర్త :** అతనికైతే నిద్రా పోయింది, డబ్బులూ పోయాయి.

**దాదాశ్రీ :** ఔను. అందుకే అక్కడ ఈ జ్ఞానం తయారుగా ఉంది, 'జరిగిందే కరెక్ట్' అని. అప్పుడిక అంతా సరి అవుతుంది.

విషయం ఏమిటంటే, 'జరిగిందే న్యాయం' అన్నది అర్థం చేసుకుంటే, ప్రపంచమంతా గట్టెక్కుతుంది. ఈ ప్రపంచంలో ఒక సెకండుకి కూడా అన్యాయం జరగదు. న్యాయమే జరుగుతుంది. కానీ బుద్ధి మనలను ఇరుకున పెడుతుంది, న్యాయం అని ఎలా అంటాము అంటూ. అందుకే నేను మూల విషయం చెప్తాను, ఇది ప్రకృతికి చెందినది. మీరు బుద్ధి నుంచి విడిపడండి అని. బుద్ధే ఇందులో మిమ్మల్ని ఇరికిస్తుంది. ఒకసారి అర్థం చేసుకున్న తర్వాత ఇక బుద్ధి చెప్పేది వినకండి. జరిగిందే న్యాయం. కోర్టు న్యాయంలో తేడాలు ఉండవచ్చు, పైనా కిందా అవొచ్చు. కానీ ఈ న్యాయంలో ఎటువంటి తేడా ఉండదు.

## పంపకాలలో తేడా ఉంటే అదే న్యాయం

కుటుంబంలో తండ్రి మరణించిన తర్వాత అన్నదమ్ములందరి భూములు, పెద్ద కొడుకు ఆధీనంలోకి వస్తాయి. ఆ పెద్దన్న మాటిమాటికీ చిన్నవాళ్ళని బెదిరిస్తుంటాడు, వాళ్ళకి భూమి ఇవ్వడు. 250 కుంటల భూమి. నలుగురు అన్నదమ్ములకు యాభైయాభై కుంటల భూమినివ్వాలతను. కాని, ఒకడు యాభై

తీసుకుంటే, ఒకడు ఇరవై ఐదు, ఒకడు నలభై కుంటలు తీసుకున్నాడు, ఒకడి వాటాలో కేవలం ఐదు కుంటలే వచ్చాయి.

అలాంటప్పుడు ఎలా అర్థం చేసుకోవాలి? లోకంలోని న్యాయం ప్రకారం పెద్దన్న లుచ్ఛా, అబద్ధాలకోరు. ప్రకృతి ధర్మం ఏమంటుంది, పెద్దవాడు కరెక్ట్ అని. యాభైవాడికి యాభై, ఇరవై వాడికి ఇరవై, నలభై వాడికి నలభై, ఈ ఐదు వాడికి ఐదు కుంటల భూమే ఇచ్చాడు. మిగతాదంతా పోయిన జన్మలోని లెక్కలో సరిపోయింది. మీకు నా మాటలు అర్థమౌతున్నాయా?

దెబ్బలాట పెట్టుకోగూడదనుకుంటే ప్రకృతి ప్రకారం వెళ్ళండి, లేకుంటే ప్రపంచమైతే జగడాలదే. ఇక్కడ న్యాయం జరగదు. న్యాయమనేది చూడటానికే, నాలో కాస్త పరివర్తన, కాస్త తేడా వచ్చిందా అని. నాకు న్యాయం జరిగితే నేను న్యాయం చేసేవాడిని అని నిర్ణయం అయిపోయింది. న్యాయమనేది మనదగ్గరున్న ఒక థర్మామీటర్ లాంటిది. కాకపోతే వ్యవహారంలో న్యాయం జరగదు కదా. న్యాయంలోకి వస్తే మనిషి పరిపూర్ణుడైనట్లే. అప్పటి వరకు అతను అబౌ నార్మలిటీలో కాని లేక బిలో నార్మలిటీలో కాని ఉంటాడు.

కనుక, ఆ పెద్దన్న చిన్నవాడికి పూర్తి వాటా ఇవ్వడు. ఐదు కుంటలే ఇస్తాడు. అక్కడ మనుషులు న్యాయం చెయ్యటానికి వెళ్తారు. పెద్దన్నయ్యది తప్పు అని తేలుస్తారు. ఇదంతా తప్పు. నీది భ్రాంతి కనుక, భ్రాంతిని నిజంగా నమ్మావు. వేరే దారిలేక దీన్ని నిజం అని నమ్మావు అంటే ఈ వ్యవహారాన్నే నిజమని నమ్మితే దెబ్బతింటావు కదా. కానీ ప్రకృతి ధర్మంలో తప్పొప్పులు ఉండవు.

అలాంటి సందర్భంలో మనం, 'నువ్వు అలా చేసుండగూడదు, వీళ్ళకి ఇంత ఇవ్వాలి!' అని అనలేము. లేకపోతే మనం వీతరాగులం అనిపించుకోము. ఇలా మనం పాత లెక్కలను చూస్తాము.

ఒకవేళ నన్ను, 'మీరు న్యాయం చెయ్యండి' అని అంటే, నేను అంటాను, 'భయ్, మా న్యాయం చేసే విధానం వేరుగా ఉంటుంది కాని ఈ జగత్తులోని న్యాయం వేరే విధంగా ఉంటుంది' అని. నాదైతే ప్రకృతి న్యాయం. వర్ల్డ్ రెగ్యులేటర్

ఉందికదా, అది దీన్నంతా రెగ్యులేషన్‌లోనే ఉంచుతుంది. క్షణమాత్రమైనా అన్యాయం జరగదు. కానీ లోకులకు అన్యాయంలా ఎందుకు కనిపిస్తుంది? ఇక వాళ్ళు న్యాయాన్ని వెతుకుతారు. నీకు రెండు ఎందుకు ఇవ్వలేదు, ఐదు ఎందుకు ఇచ్చాడు? అరె భాయ్, నీకు ఏది ఇచ్చాడో అదే న్యాయం. ఎందుకంటే ఇదంతా పూర్వపు లెక్క ఎదురెదురుగా జరిగిపోతూవుంది. చిక్కుపడే ఉంది కాని, ఇది లెక్క. అంటే న్యాయం ఒక థర్మామీటరు. థర్మామీటర్‌లో చూడవలసింది, 'నేను ఇంతకు ముందు న్యాయం చెయ్యలేదు కనుకనే, నా పట్ల అన్యాయం జరిగింది. థర్మామీటర్ లోపం కాదిది' అని. మీకేమనిపిస్తోంది? నామాటలు మీకేమైనా హెల్ప్ చేస్తాయా?

**ప్రశ్నకర్త :** చాల హెల్ప్ చేస్తాయి.

**దాదాశ్రీ :** లోకంలో న్యాయాన్ని వెతకకు. ఏదైతే జరుగుతూవుందో, అదే న్యాయం. మనం చూడవలసిందంతా ఏం జరుగుతున్నది అన్నది మాత్రమే. 'యాభై కుంటలకు బదులు ఐదు కుంటలు వస్తోంది' అంటారు. అన్నతో ఇలా అనండి, 'సరే. మీకు సంతోషమే కదా!' అతను 'ఔను' అంటే, తెల్లవారి నుంచి అతనితో కలిసి తిరగటం, కలిసి భోజనం చెయ్యటం చెయ్యండి. అదే లెక్క. లెక్కకు అతీతంగా ఎవరూ పోరు. తండ్రి కొడుకుల నుంచి లెక్క అడిగి తీసుకోకుండా ఉండడు. అది వ్యవహారంలోని లెక్కలు మాత్రమే కాని, సంబంధం కాదు. మీరేమో సంబంధం అని అనుకుంటున్నారు.

## తొక్కేసాడు, అదీ న్యాయమే

బస్సు ఎక్కటానికి ఒక వ్యక్తి రైట్‌సైడ్‌లో నిలబడివున్నాడు, అతను రోడ్డుకి సైడ్‌లో నిలబడివున్నాడు. రాంగ్‌సైడ్ నుంచి ఒక బస్సు వచ్చింది. అది అతని మీదకు వెళ్ళి అతన్ని చంపేసింది. ఏమిటి, దీన్ని న్యాయం అంటారా?

**ప్రశ్నకర్త :** లోకులు అలాగే అంటారు, డ్రైవర్ అతన్ని బస్సుతో గుద్ది చంపేసాడని.

**దాదాశ్రీ :** ఔను వ్యతిరేక దిశలో వచ్చాడు కొట్టాడు. తప్పే చేసాడు. రావలసిన దిశలో వచ్చి కొట్టినా అతనిదే తప్పంటారు. ఇది డబల్ తప్పిదం. కానీ ప్రకృతి అతన్ని 'కరెక్ట్‌గా చేసాడు' అనే అంటుంది. గొడవ పెట్టుకున్నా అది వ్యర్థంగానే పోతుంది. అంతకు ముందు లెక్క తీర్చేసాడు. కానీ అలా అనుకోరు కదా! జీవితమంతా పగలగొట్టుకోవటంలో గడిచిపోతుంది. కోర్టు, వకీలు ఇంకా... ఒకవేళ ఆలస్యమైతే వకీలు కూడా తిట్టిపోస్తాడు, 'నీకు అసలు బుద్ధి లేదు. గాడిదలాంటి వాడివి' అని. అతను ఆ తిట్లు తింటాడు! దాని బదులు అది ప్రకృతి న్యాయం అని అర్థం చేసుకుంటే, దాదాజీ చెప్పివున్నారు కదా, అదే న్యాయం. అప్పుడు సమాధానం దొరుకుతుంది కదా? కోర్టుకి వెళ్ళటంలో తప్పు లేదు. కోర్టుకి వెళ్ళండి, అతనితో (విరోధితో) కూర్చుని టీ తాగండి, అలా వ్యవహరించాలి (సమాధానపూర్వకంగా పూర్తిచేయాలి). అతను ఒప్పుకోకపోతే చెప్పండి, 'నాతో టీ తాగు, నా దగ్గర కూర్చో' అని ప్రేమపూర్వకంగా మాట్లాడండి (లోపల రాగద్వేషాలు ఏమీ లేకుండా).

**ప్రశ్నకర్త :** అటువంటి మనుషులు మనకు విశ్వాసఘాతం కూడా తలపెడతారు కదా?

**దాదాశ్రీ :** మనిషి ఏమీ చెయ్యలేడు. మీరు ఒకవేళ ప్యూర్ అయినట్లయితే, మిమ్మల్ని ఏమీ చెయ్యలేడు. ఇదే ఈ జగత్తులోని చట్టం. ప్యూర్ అయినట్లయితే ఇక ఏమైనా చేసేవారు ఎవరూ ఉండరు. అందువలన తప్పులను సరిదిద్దుకోవాలంటే సరిదిద్దుకోండి.

## ఆగ్రహాన్ని వదిలిపెట్టినవాడు గెలుస్తాడు

ఈ జగత్తులో న్యాయాన్ని చూసేందుకు పోతున్నావా? జరిగిందే న్యాయం. 'ఇతను చెంప మీద కొడితే నామీద అన్యాయం చేసాడు' అలా కాదు, ఏం జరిగిందో అదే న్యాయం అని ఎప్పుడైతే అర్థమౌతుందో అప్పుడు అంతా సర్దుకుంటుంది.

'జరిగిందే న్యాయం' అని అనుకోకపోతే బుద్ధి ఎగిరెగిరిపడుతుంటుంది. అనంత జన్మల నుంచీ ఈ బుద్ధి అంతా గడబిడ చేస్తూవస్తోంది, అభిప్రాయభేదాలను కలిగిస్తుంది. నిజానికి ఏమైనా చెప్పే అవసరమే రాగూడదు. నాకు ఏమైనా చెప్పే అవసరమే రాదు. అలా వదిలేసినవారు గెలుపొందారు. వాళ్ళు తమ బాధ్యత మీదనే లాగుతుంటారు. బుద్ధి లేకుండా పోయిందని ఎలా తెలుస్తుంది? న్యాయాన్ని వెతికే పనిలోకి పోకండి. 'ఏం జరిగిందో అదే న్యాయం' అని అన్నప్పుడు బుద్ధి వెళ్ళిపోయింది అని చెప్పవచ్చు. బుద్ధి ఏం చేస్తుంది? న్యాయాన్ని వెతుకుతూ పోతుంటుంది. దానిమీదనే ఈ ప్రపంచం ఆధారపడి నిలిచింది. కనుక, న్యాయాన్ని వెదకకండి.

న్యాయాన్ని వెదకాల్సివుంటుందేమో? ఏం జరిగిందో అదే కరెక్ట్ అనేది తక్షణం తయారుగా ఉంటుంది. ఎందుకంటే, 'వ్యవస్థిత' తప్ప మరేమీ ఉండనే వుండదు. అనవసరంగా హాయ్ హాయ్! హాయ్ హాయ్!

## మహారాణి కాదు, వసూలు వాళ్ళతో పేచీ

బుద్ధి తుఫాన్‌నే రేపుతుంది. బుద్ధే కదా అంతా పాడుచేసేది! బుద్ధి అంటే ఏమిటి? న్యాయాన్ని వెతికేదే బుద్ధి. అది అంటుంది, 'డబ్బులెందుకు ఇవ్వరు? సరుకైతే తీసుకునిపోయారు కదా?' అని. ఈ విధంగా ఎందుకు అని అడిగేది బుద్ధి. అన్యాయం జరిగితే అదే న్యాయం. మీరు డబ్బు వసూలు చేసే ప్రయత్నం చేస్తూనేవుండండి. 'నాకు డబ్బులు చాల అవసరం. మాకు చాల కష్టంగా ఉంది' అనండి. కాని, 'అతను ఎందుకు ఇవ్వడు?' అని అంటే మాత్రం వకీలుని వెతుక్కుంటూ పోవలసివుంటుంది. ఇక సత్సంగం వదిలిపెట్టి అక్కడకు పోయి కూర్చుంటావు. 'ఏం జరిగిందో అదే న్యాయం' అని అంటే, బుద్ధి అనేది ఉండకుండా వెళ్ళిపోతుంది.

లోపల 'ఏం జరుగుతూవుందో, అదే న్యాయం' అని గట్టిగా నమ్మాలి. అయినా, మీకు వ్యవహార రీత్యా డబ్బులు వసూలుకి వెళ్ళవలసివస్తే, ఈ విధంగా నమ్మటం వలన మీ మనసులో కల్లోల పడదు. వాళ్ళ మీద చికాకు రాదు, మనసు వ్యాకులమవదు. నాటకంలో ఉన్నట్లుగా అక్కడికి పోయి కూర్చోండి.

అతనితో, 'నేను నాలుగుసార్లు వచ్చాను. మీతో కలవటం పడలేదు. ఈ సారి, మరి మీరు చేసుకున్న పుణ్యమో లేక నేను చేసుకున్న పుణ్యమో కాని, మనం కలవటం జరిగింది' అనండి. అలా సరదాగా మాట్లాడుతూ డబ్బు వసూలు చేసే పని చేయండి. ఇంకా, 'మీరు హాయిగా ఉన్నారు కాని నేను చాల కష్టంలో ఉన్నాను' అనండి. ఒకవేళ అతను, 'మీకేం కష్టం వచ్చింది?' అని అంటే, 'నా కష్టాలు నాకే తెలుసు. మీ దగ్గర డబ్బులు లేకపోతే వేరెవరి దగ్గరైనా తీసుకుని ఇప్పించండి' అనండి. అలా మాట్లాడి పని జరిపించుకోవాలి. లోకులు అహంకారులు అయితే మన పని నెరవేరుతుంది. అహంకారులు కాకపోతే పని నడవదు. అహంకారి అహంకారాన్ని కాస్త పైకి లేపినట్లయితే, అతను అంతా చేసేస్తాడు. మీరు ఒకవేళ, 'ఐదు పది వేలు ఇప్పించండి' అని అంటే కూడా, 'సరే నేను ఇప్పిస్తాను' అంటాడు. అంటే జగడం పెట్టుకోగూడదు. రాగద్వేషాలేమీ పెట్టుకోవద్దు. వందసార్లు తిరిగినా ఇవ్వకపోయినా సరే పరవాలేదు. 'జరిగిందే న్యాయం' అన్నది అర్థం చేసుకోండి. నిరంతరం న్యాయమే జరుగుతుంది. ఏమిటి మీ ఒక్కరి బాకీయే మిగిలిపోయిందా?

**ప్రశ్నకర్త :** లేదు లేదు! వ్యాపారంలో ఉన్నవాళ్ళందరికీ అలా జరుగుతుంది.

**దాదాశ్రీ :** జగత్తులో ఎవరూ మహారాణి వలన ఇరుక్కుపోలేదు. బాకీ వసూలీతో ఇరుక్కుపోయారు. చాలమంది నాతో, 'నా పది లక్షల బాకీ వసూలవటం లేదు' అంటారు. మొదట్లో బాకీ వసూలౌతుండేది. సంపాదిస్తున్నంత కాలం నన్నెవరూ ఏమీ అనటానికి రాలేదు. ఇప్పుడు మాటలంటున్నారు. బాకీ వసూలు అనే పదాన్ని మీరు వినివున్నారా?

**ప్రశ్నకర్త :** చెడ్డ పదమంటూ నేను వింటే అది బాకీ వసూలే కదా?

**దాదాశ్రీ :** ఔను బాకీ వసూలే కదా. అతను అంటాడు. బాగానే అంటాడు. డిక్షనరీలో లేని పదాలను కూడా అంటాడు. ఇక మీరు డిక్షనరీలో వెతుక్కుంటారు 'ఈ పదాన్ని ఎక్కడి నుంచి తీసుకొచ్చాడు?' అని. అందులో

అలాంటి పదాలే ఉండవు. అలా పిచ్చిపిచ్చిగా ఉంటాయి. కానీ వాళ్ళు తమ బాధ్యత మీదనే అంటారు కదా! అందులో మన బాధ్యతేమీ ఉండదు కదా! అంతవరకు మంచిదే.

మీకు డబ్బు తిరిగివ్వకపోతే అదీ న్యాయమే. తిరిగిస్తే అదీ న్యాయమే. ఆ లెక్కలన్నిటినీ నేను చాల కాలం క్రితమే పూర్తిచేసాను. ఎవరూ ఒక రూపాయి కూడా తిరిగివ్వకపోతే ఎవరి దోషమూ లేదు. అలాగే ఎవరైనా తిరిగివ్వటానికి వస్తే, అందులో అతను చేసిన మేలు మాత్రం ఏమిటి? ఈ జగత్తు నిర్వహణ వేరే విధంగా జరుగుతోంది.

## వ్యవహారంలో దుఃఖానికి మూలం

న్యాయం వెతికి వెతికీ ఆయాసం వచ్చింది. మనిషి మనసులో, 'నేను ఇతనికేం అన్యాయం చేసానని, ఇతను నాకు చెడు చేస్తున్నాడు' అని ఆలోచన వస్తుంది.

**ప్రశ్నకర్త :** అలా ఔతుంది. మనం ఎవరిమీదనైనా నేరం మోపకపోయినా, లోకులు ఎందుకు మనలను కర్రలతో కొడతారు?

**దాదాశ్రీ :** ఆ. అందుకే ఇన్ కోర్ట్, వకీళ్ళది ఇతరులది నడుస్తోంది. అలా జరగకపోతే కోర్టు ఎలా నడుస్తుంది? వకీళ్ళకి ఎవరూ గ్రాహకులు కూడా ఉండరు కదా! కానీ వకీళ్ళు కూడా ఎంత పుణ్యం చేసుకునివున్నారు! ఉదయాన్నే ఠంచనుగా తయారై వస్తారు. వకీలు గారు షేవింగ్ చేసుకుంటూవుంటే కాసేపు వేచివుంటారు. డబ్బులు ఇవ్వటానికి వకీలుగారి ఇంటికే వస్తారు. వకీళ్ళు ఎంతటి పుణ్యం చేసుకున్నవారు! నోటీసు రాయించుకుని యాభై రూపాయలు ఇచ్చిపోతారు. కనుక, న్యాయాన్ని వెతకకపోతే బండి దారిలోకి వస్తుంది. మీరు న్యాయాన్ని వెతుక్కుంటారు, అదే మీ బాధ.

**ప్రశ్నకర్త :** కానీ దాదా, ఎలాంటి రోజులు వచ్చాయో కదా, మేలు చేసినవారినే కర్రలతో తంతారు.

**దాదాశ్రీ:** అతనికి సహాయం చేస్తే అతనే కర్రతో కొట్టటానికి వచ్చాడా? అదే న్యాయం. కానీ ముఖం మీద అనకండి అలా. ముఖం మీద అంటే అతను సిగ్గుమాలినవాడౌతాడు.

**ప్రశ్నకర్త:** మనం ఎవరితోనైనా తిన్నగానే ఉన్నా, అతను మనల్ని కర్రలతో తంతాడు.

**దాదాశ్రీ:** కర్రలతో తంతే అదే న్యాయం. ప్రశాంతంగా బతకనీయరా?

**ప్రశ్నకర్త:** షర్ట వేసుకుంటే 'షర్టు ఎందుకు తొడుక్కున్నావు' అంటారు. దాన్ని విప్పేసి టిషర్ట్ వేసుకుంటే, 'టీ షర్ట్ ఎందుకు వేసుకున్నావ్?' అంటారు. దాన్ని విప్పేస్తే, 'ఎందుకు విప్పేసావు?' అంటారు

**దాదాశ్రీ:** దాన్నే మనం న్యాయం అంటాం కదా! మరి అందులో న్యాయాన్ని వెతకటానికి వెళ్తేనే ఇలా దెబ్బతినటం జరుగుతుంది. అందువలన న్యాయాన్ని వెతకవద్దు. ఇది నేను కనిపెట్టిన తిన్నని, సరళమైన విధానం. న్యాయాన్ని వెతికితే మనందరం దెబ్బలు తిన్నవాళ్ళమే. అయినా ఇంకా ఎక్కడివాళ్ళం అక్కడే. చివరకు అక్కడికే వచ్చేస్తాము. అలాంటప్పుడు మొదట్లోనే ఎందుకు అర్థం చేసుకోరు? ఇది కేవలం అహంకారం చేసుకున్న జోక్యం.

జరిగిందే న్యాయం! కనుక న్యాయాన్ని వెతికేందుకు పోకండి. మీ తండ్రిగారు, 'నువ్వలా నువ్విలా' అని అంటే, అక్కడేం జరిగిందో, అదే న్యాయం. మీరు అలా ఎందుకు చేసారంటూ ఆయన మీద దావా వెయ్యకండి. ఇది అనుభవంతో చెప్పే మాట. లేకపోతే చివరకు అలసిపోయి న్యాయాన్ని స్వీకరించవలసి వస్తుంది. జనం అలా స్వీకరిస్తారా లేదా? ఒట్టిగా వ్యర్థ ప్రయత్నాలు చేస్తుంటారు కానీ, ఎలా ఉందో అలాగే ఉండిపోతుంది. అదే అంగీకరించి వున్నట్లయితే, చెడిపోయేదేముంటుంది? ఔను, అతని ఎదురుగా అనే అవసరం లేదు. లేకపోతే అతను వెనక్కి తప్పుదారిలో పోతారు. మనసులోనే అనుకోండి, జరిగిందే న్యాయం అని.

ఇక బుద్ధిని ఉపయోగించవద్దు. ఏదైతే జరిగిందో దాన్నే న్యాయం అనాలి. 'ఎవరు చెప్పారు నీకు, వేడి నీళ్ళను పెట్టావు?' అని అంటారు. 'అరె, జరిగిందే న్యాయం'. ఈ న్యాయం అర్థమైతే, 'ఇక నేను దావా వెయ్యను' అంటారు. అంటారా లేదా?

ఎవరైనా ఆకలితో ఉంటే, అతనికి భోజనం పెట్టటానికి కూర్చోబెట్టి, తర్వాత, 'మీకు భోజనం పెట్టించమని ఎవరు చెప్పారు? అనవసరంగా మమ్మల్ని ఇబ్బంది పెట్టారు, సమయనష్టం చేసారు' అంటే, మనం ఏం చెయ్యాలి? విరోధించాలా? ఇది ఏదైతే జరిగిందో, అదే న్యాయం.

ఇంట్లో ఇద్దరిలో ఒక వ్యక్తి తన బుద్ధిని ఉపయోగించటం మానేస్తే, అంతా పద్ధతి ప్రకారం జరిగిపోతుంది. అతను తన బుద్ధిని ఉపయోగిస్తే ఏమౌతుంది? రాత్రికి అన్నం కూడా దొరకదు.

వర్షం పడలేదంటే అది న్యాయమే. అప్పుడు రైతు ఏమంటాడు? 'భగవాన్ అన్యాయం చేస్తున్నాడు' అని అతను తెలివితక్కువగా అంటాడు. దాని వలన వర్షం పడుతుందా ఏమిటి? వర్షం పడకపోతే అదే న్యాయం. ఒకవేళ ఎల్లవేళలా వర్షం పడితేనా, ప్రతి సంవత్సరం మంచి వర్షాలు పడితే అందులో వర్షానిదేం పోతుంది? ఒక చోట వర్షం చాల అధికంగా పడి, అంతా నీటితో నిండిపోతుంది, మరోచోట కరువు ఏర్పడుతుంది. ప్రకృతిలో అంతా 'వ్యవస్థితం' గానే ఉంది. మీకేమనిపిస్తుంది, ప్రకృతిలోని వ్యవస్థ బాగుంది కదా? ప్రకృతి అంతా న్యాయమే చేస్తోంది.

అంటే ఇదంతా సిద్ధాంతపరంగా నడుస్తూవుంది. బుద్ధిని ఖాళీ చేయాలంటే ఇది ఒకటే నియమం. ఏదైతే జరుగుతూవుందో, అదే న్యాయమని భావించినట్లయితే, బుద్ధి వెళ్ళిపోతుంది. బుద్ధి ఎంతవరకు జీవించివుంటుంది? జరుగుతున్నదాంట్లో న్యాయాన్ని వెతుకుతున్నంతవరకు బుద్ధి జీవించివుంటుంది. అప్పుడు బుద్ధి అర్థం చేసుకుంటుంది, బుద్ధికి సిగ్గువస్తుంది. దాని కూడా సిగ్గువస్తుందు, అరె. ఇప్పుడు ఈ యజమాని కూడా అలా చెప్తున్నాడు కనుక, నేను నా స్థాయికి దిగివచ్చేయాల్సిందే.

## ఇందులో న్యాయాన్ని వెతికిచూడకండి

**ప్రశ్నకర్త :** బుద్ధిని తీసిపడేయాల్సిందే. ఎందుకంటే అదే ఎక్కువ దెబ్బతినేటట్లుగా చేస్తుంది.

**దాదాశ్రీ :** అలా బుద్ధిని తీసిపడేయాలంటే, బుద్ధి తనంతట తానుగా పోదు. బుద్ధి 'కార్యం', దాని 'కారణాన్ని' తీసిపడేస్తే ఆ 'కార్యం' పోతుంది. ఇది బుద్ధి 'కార్యం' మరి దాని 'కారణం' ఏమిటి? నిజానికి ఏం జరిగిందో దాన్ని న్యాయం అంటే, అప్పుడు అది వెళ్ళిపోతుంది. జగత్తు ఏమంటుంది? నిజానికి ఏదైతే జరిగిందో, దాన్ని స్వీకరించాలి. న్యాయాన్ని వెతకటానికిపోతే జగడాలు కొనసాగుతూనే వుంటాయి.

కనుక, బుద్ధి అదే వెళ్ళిపోదు. బుద్ధి వెళ్ళిపోవాలంటే మార్గమేమిటి? దాని కారణాలను స్వీకరించకపోతే అది 'కార్యం' అవదు.

**ప్రశ్నకర్త :** మీరు అన్నారుకదా బుద్ధి 'కార్యం' అని, దాని 'కారణం' వెతికితే ఆ కార్యం ఆగిపోతుందని.

**దాదాశ్రీ :** దాని కారణాలలో మనం న్యాయాన్ని వెతుకుతామే, అదే దాని కారణం. న్యాయాన్ని వెతకటం నిలిపివేస్తే బుద్ధి వెళ్ళిపోతుంది. న్యాయాన్ని ఎందుకు వెతుకుతున్నావు? అప్పుడు కోడలు ఏమంటుంది, 'కానీ నీకు నా అత్త గురించి తెలియదు. నేను వచ్చిన దగ్గరి నుంచి నాకు ఆమె బాధ కలిగిస్తూనేవుంది. ఇందులో నా తప్పేముంది?' అని.

ఎవరైనా తెలియకుండా బాధ కలిగిస్తూవుండవచ్చా? ఆ లెక్క జమ అవుతుంది. అందుకే నీకు ఇస్తూవుంది. అప్పుడు 'కానీ నేను ఆమె ముఖం కూడా చూడలేదు' అంటారు. 'అరె, నువ్వు ఈ జన్మలో చూడలేదు కానీ, పూర్వ జన్మలో లెక్క ఏమంటోంది?' అందుకే ఏం జరిగిందో అదే న్యాయం.

ఇంట్లో కొడుకు దాదాగిరీ చేస్తుంటాడా? అతను దాదాగిరీ చేస్తుంటాడు కదా, అదే న్యాయం. కొడుకు అయ్యుండి తండ్రి మీద దాదాగిరీ చేస్తాడా అని చూపించేదే బుద్ధి. ఏం జరిగిందో అదే న్యాయం.

కనుక, ఈ అక్రమ విజ్ఞానం ఏమంటుంది? చూడు అది న్యాయం! లోకులు నన్ను అడుగుతుంటారు, 'మీరు బుద్ధిని ఎలా తీసేసుకున్నారు?' అని. న్యాయాన్ని వెతకకపోతే బుద్ధి వెళ్ళిపోయింది. బుద్ధి ఎంతవరకు ఉంటుంది? న్యాయాన్ని వెతుకుతున్నంతవరకు, న్యాయానికి ఆధారం కల్పించేంత వరకు బుద్ధి ఉంటుంది. అప్పుడు బుద్ధి, 'మీ పక్షానే ఉన్నాను అన్నగారు' అంటుంది. ఇంకా, 'ఎంతబాగా ఉద్యోగం చేసాను, ఈ డైరెక్టర్ ఎందుకని వ్యతిరేకంగా మాట్లాడుతున్నాడు?' అంటుంది. ఆ విధంగా, దానికి ఆధారం కలిగిస్తావా, న్యాయాన్ని వెతుకుతావా? వాళ్ళు ఏమైతే అంటున్నారో అదే కరెక్ట్. ఇప్పటి వరకు ఎందుకు ఏమీ అనలేదు? దేనివలన అనలేదు? ఇప్పుడు ఏ న్యాయం ఆధారంగా మాట్లాడుతున్నారు? ఆలోచిస్తే అర్థం కావటంలేదా, వీళ్ళు మాట్లాడుతున్నది లెక్కప్రకారమేనా? అరె, జీతం పెంచకపోతే అదే న్యాయం. మనం అతన్ని అన్యాయం చేసాడని ఎలా అంటాము?

## బుద్ధి న్యాయాన్ని వెతుకుతుంది

ఇదంతా తెచ్చిపెట్టుకున్న దుఃఖమే. కొద్దిగా ఏమైనా దుఃఖం అంటూవుంటే అది బుద్ధి కారణంగానే. అందరిలోను బుద్ధి ఉంటుంది కదా? ఆ 'డెవలప్డ్ బుద్ధి' దుఃఖం కలిగిస్తుంది. లేని చోటి నుంచి కూడా దుఃఖాన్ని బయటకు తీస్తుంది. డెవలప్డ్ అయిన తర్వాత నా బుద్ధి వెళ్ళిపోయింది. బుద్ధి అంతమైంది. చెప్పండి, మజా వచ్చిందా లేదా? అస్సలు ఒక పర్సెంట్ కూడా బుద్ధి అనేది లేదు. అప్పుడు ఒక వ్యక్తి నన్ను, 'బుద్ధి ఎలా అంతమైంది? నువ్వు వెళ్ళిపో, నువ్వు వెళ్ళిపో అంటే పోయిందా?' అని అడిగాడు. దానికి నేను, 'లేదు బాబూ అలా అనగూడదు. ఇప్పటి వరకు అది మన పెద్దరికాన్ని నిలిపింది. ద్వంద్వంలో ఉండేవాళ్ళం, సరైన సమయంలో దానికి మార్గదర్శనం అంతా ఇవ్వటం జరిగింది, 'ఏం చెయ్యాలి, ఏం చెయ్యొద్దు? దాన్ని ఎలా తీసివేయవచ్చు?' అంటూ. అప్పుడు నేను, 'ఎవరైతే న్యాయాన్ని వెతుకుతారో, వాళ్ళ దగ్గర బుద్ధి ఎప్పటికీ నివాసం ఉంటుంది' అని అన్నాను. 'జరిగిందే న్యాయం' అని అనేవాళ్ళ బుద్ధి వెళ్ళిపోతుంది. న్యాయాన్ని వెతుకుతూ వెళ్ళేది బుద్ధి.

**ప్రశ్నకర్త :** కానీ దాదాజీ, జీవితంలో వచ్చేదంతటినీ స్వీకరిస్తూ పోవాలా?

**దాదాశ్రీ :** దెబ్బతిని స్వీకరించేబదులు, సంతోషంగా స్వీకరించటం మంచిది కదా.

**ప్రశ్నకర్త :** సంసారం, పిల్లలు, కొడుకుకి ఒక కోడలు, అదుంటుంది, ఇదుంటుంది, కనుక సంబంధం పెట్టుకోవలసివుంటుంది.

**దాదాశ్రీ :** ఆ. అన్నీ పెట్టుకోండి.

**ప్రశ్నకర్త :** మరి అందులో దెబ్బతింటే ఏం చెయ్యాలి?

**దాదాశ్రీ :** అన్ని రకాల సంబంధాలను పెట్టుకోవాలి, దెబ్బ తగిలితే, దాన్ని స్వీకరించాలి. లేకపోతే మళ్ళీ దెబ్బతింటే ఏం చెయ్యగలుగుతారు? మరేదైనా ఉపాయం ఉందా?

**ప్రశ్నకర్త :** ఏమీ లేదు. వకీలు దగ్గరికి పోవలసివుంటుంది.

**దాదాశ్రీ :** ఔను అప్పుడు ఏమౌతుంది? వకీలు రక్షిస్తాడా లేకపోతే తన ఫీజు తీసుకుంటాడా?

## ఎక్కడైతే 'జరిగిందే న్యాయం' ఉంటుందో, అక్కడ బుద్ధి 'ఔట్'

న్యాయాన్ని వెతకటం మొదలవగానే బుద్ధి లేచి నిలబడుతుంది. బుద్ధి, ఇప్పుడు తను లేకుండా ఏమీ నడవదు అనుకుంటుంది. అప్పుడు మనం జరిగిందే న్యాయం అంటే, దానికి బుద్ధి, 'ఈ ఇంట్లో ఇక నా పెత్తనం చెల్లదు' అనుకుంటుంది. అక్కడి నుండి సెలవు తీసుకుంటుంది. దాన్ని సమర్థించేవారెవరైనా ఉంటే లోపలికి చొరబడుతుంది. దాని మీద ఆసక్తివున్నవారు ఎందరో ఉన్నారు కదా! నా బుద్ధి పెరగాలి అని వాళ్ళు కోరుకుంటారు! ఇక దాని ఎదురుగా ఉన్న సిబ్బెలో అంత దుఃఖం, మంట మొదలౌతుంది. ఎప్పుడూ బ్యాలెన్స్ ఉండాలి కదా? దాని ముందు సిబ్బెలో బ్యాలెన్స్ ఉండాలి కదా! నా బుద్ధి అంతమయింది, దానితో దుఃఖం, మంట అంతమయ్యాయి.

## వికల్పాల అంతమే మోక్షమార్గం

కనుక, ఏదైతే జరిగిందో దాన్ని న్యాయమని అన్నట్లయితే నిర్వికల్పంలో ఉంటావు. నిర్వికల్పమవటానికి లోకులు న్యాయాన్ని వెతుకటానికి పోతారు. వికల్పాల అంతం జరిగినపుడు, అదే మోక్షానికి మార్గం! వికల్పాలే కలుగకపోవటమే కదా మన మార్గం?

శ్రమపడకుండానే మన అక్రమ మార్గంలో మనుషులు ముందుకు సాగుతారు. నా తాళంచెవులు ఎలాంటివంటే, శ్రమపడకుండానే ఎదుగుతారు.

ఇక బుద్ధి వికల్పం కలుగజేస్తే, దానితో, 'జరిగిందే న్యాయం' అని అనండి. బుద్ధి న్యాయం వెతుకుంది, నాకంటే చిన్నవాడు, మర్యాద ఉంచడు అని. మర్యాద ఉంచితే అది న్యాయమే. ఉంచకపోతే అదీ న్యాయమే. బుద్ధి ఎంత నిర్వివాదంగా అయితే అంత నిర్వికల్పి అవుతుంది.

ఈ విజ్ఞానం ఏమని చెప్తుంది? న్యాయాన్ని ప్రపంచమంతా వెతుకుతోంది. దానిబదులు, జరిగిందే న్యాయం అని మనం స్వీకరిస్తే, ఇక జడ్జ్ అవసరం లేదు, వకీలు అవసరం లేదు. లేకపోతే చివరకు దెబ్బతిన్న తర్వాత కూడా పరిస్థితి అలాగే ఉంటుంది కదా?

## ఏ కోర్టులోనూ సంతోషం లభించదు

ఎవరైనా వ్యక్తికి న్యాయం కావాలే అనుకోండి. అతను జడ్జ్‌మెంట్ కోసం కింది కోర్టుకి వెళ్తాడు. వకీళ్ళు పోరాడుతారు, ఆ తర్వాత జడ్జ్‌మెంట్ వస్తుంది, న్యాయం జరుగుతుంది, అప్పుడతను, 'ఈ న్యాయంతో నాకు సంతోషం కలుగలేదు' అంటాడు. 'మరి ఏం చెయ్యాలి అప్పుడు? పై కోర్టుకి పోవాలి.' అప్పుడు డిస్ట్రిక్ట్ కోర్టుకి వెళ్తారు. అక్కడి జడ్జ్‌మెంట్‌తో కూడా సంతోషం కలుగలేదు. అప్పుడు, 'హైకోర్టుకి వెళ్దాం' అంటారు. అక్కడ కూడా సంతోషం కలుగలేదు. తర్వాత సుప్రీం కోర్టుకి వెళ్ళారు. అక్కడా సంతోషం కలుగలేదు. చివరకు ప్రెసిడెంట్‌కి చెప్తారు. అయినా, ఆయన చెప్పిన న్యాయంతోను సంతోషం కలుగలేదు.

దెబ్బతినిపోతారు. ఈ మనిషి నన్ను ఎందుకు తిట్టాడు అని అందులో న్యాయం వెతకాలని, ఇక నా వకాలత్‌కి అయిన ఖర్చుని కూడా ఇవ్వడం అని అనుకోకు. ఇవ్వటంలేదు, అదే న్యాయం. ఒకవేళ తర్వాత వచ్చి ఇస్తే, అదీ న్యాయమే. న్యాయాన్ని నువ్వు వెతకవద్దు.

## న్యాయం : ప్రాకృతికం, వికల్పి

న్యాయం రెండు రకాలు. ఒకటి వికల్పాలను పెంచే న్యాయం, రెండవది వికల్పాలను తగ్గించే న్యాయం. పూర్తిగా సత్యమైన న్యాయం, 'జరిగిందే న్యాయం' అంటూ వికల్పాలను తగ్గిస్తుంది. ఇప్పుడు దీనిమీద మీరు మరో దావా వెయ్యకండి. నేను చెప్పే మిగతా మాటల మీద ధ్యాసపెట్టండి. దీని మీద నువ్వు దావా వేస్తే మిగతా మాటలు నిలిచిపోతాయి.

న్యాయాన్ని వెతుకుతూపోతే వికల్పాలు పెరుగుతూనేపోతాయి. ప్రకృతి న్యాయం వికల్పాలను నిర్వికల్పంగా తయారుచేస్తాయి. ఏదైతే జరిగిందో, అదే న్యాయం. అయినా, ఐదుగుర వ్యక్తులతో కూడిన పంచులు చెప్పిన తీర్పు తనకి వ్యతిరేకంగా ఉన్నట్లయితే దాన్ని కూడా అతను న్యాయం అని ఒప్పుకోడు. ఎవరి మాటలనూ ఒప్పుకోడు. ఇక వికల్పాలు పెరుగుతూనేపోతుంటాయి. ఎవరైతే తను పడటం కోసమే ఒక వలని తయారుచేసుకుంటున్నాడో, ఆ వ్యక్తి ఏమీ సాధించలేడు. చాల దుఃఖితుడౌతాడు. దానిబదులు ముందు నుంచే, జరిగిందే న్యాయం అనే దాన్నే అనుసరించండి.

ఇక ప్రకృతి అంటారా, ఎప్పుడూ న్యాయమే చేస్తుంది. నిరంతరం న్యాయమే చేస్తుంటుంది, కానీ అందుకు ప్రమాణం ఇవ్వలేదు. అది ఏ విధంగా న్యాయం అని చెప్తూ ప్రమాణం చూపించేవారు 'జ్ఞాని'. అదెలా జరిగింది అన్నది 'జ్ఞాని' వివరిస్తారు. దాన్ని సంతృప్తి చేసినట్లయితేనే విముక్తి కలుగుతుంది. నిర్వికల్పి అయినప్పుడే ముక్తి కలుగుతుంది.

**-జై సచ్చిదానంద్**

## శుద్ధాత్మకి ప్రార్థన

హే అంతర్యామీ పరమాత్మా! నీవు నాలో ఉన్నవిధంగానే జీవులందరిలో విరాజమానమై వున్నావు. నీ యొక్క దివ్య స్వరూపమే నా నిజ స్వరూపము. నా నిజ స్వరూపము పవిత్ర ఆత్మ.

హే శుద్దాత్మ భగవాన్! నేను నీకు అభేదభావముతో అత్యంతభక్తి పూర్వకంగా నమస్కరించుచున్నాను.

అజ్ఞానవశాత్తు నేను చేసిన తప్పులనన్నింటిని ❖ నీ ముందు ఒప్పుకొనుచున్నాను. నేను ఈ తప్పులకు పశ్చాత్తాపం చెందుతూ నీ క్షమకై అర్థిస్తున్నాను. ప్రభూ! దయతో నన్ను క్షమించు, నన్ను క్షమించు, నన్ను క్షమించు. ఆ తప్పులను మరల చేయకుండునట్లు నాకు శక్తిని ప్రసాదించు.

హే శుద్దాత్మ భగవాన్! మాకు నీతోగల భేద భావము తొలగిపోయి మేమందరము నీతో అభేదతను పొందునట్లు ఆశీర్వదించు. మేము సదా నీతో అభేదతతో తన్మయాకారతను చెందెదము గాక!

(❖ గతంలో నీవు చేసిన తప్పులను గుర్తు తెచ్చుకోవాలి)

## ప్రతిక్రమణ : దివ్యమైన క్షమాపణా విధానము

నేను దాదా భగవాన్ సాక్షిగా ❖...................... యొక్క మనోవచన కాయము కంటె పూర్తిగా వేరైన పవిత్రాత్మకు నమస్కరించుచున్నాను.

నేను నా తప్పులను జ్ఞప్తికి తెచ్చుకొన్నాను (ఆలోచన) ❖❖

ఆ తప్పులకై నేను క్షమాపణ కోరుచున్నాను (ప్రతిక్రమణ)

ఆ తప్పులను మరల చేయనని దృఢముగా నిశ్చయించుకొనుచున్నాను (ప్రత్యాఖ్యాన్)

ప్రియాతి ప్రియమైన దాదాభగవాన్! ఈ దృఢ నిశ్చయమును పాలించు శక్తిని నాకు అనుగ్రహించు.

❖ మీ వలన గాయపడిన వ్యక్తి పేరు

❖❖ ఆ వ్యక్తిపట్ల మీరు ఒనర్చిన దోషాలను గుర్తుచేసుకోవాలి.

# తెలుగులో దాదా భగవాన్ పుస్తకాలు

| | |
|---|---|
| 1. | అన్ని చోట్లా సర్దుబాటు |
| 2. | విభేదాలను తొలగించడానికి |
| 3. | జరిగిందే న్యాయం |
| 4. | తన తప్పులకే తాను అనుభవిస్తాడు |
| 5. | క్రోధం |
| 6. | చింత |
| 7. | నేను ఎవరు? |
| 8. | భావనతో మెరుగుపడతాయి జన్మ-జన్మలు |
| 9. | మృత్యు సమయం దానికి ముందు, దాని తర్వాత... |
| 10. | ఆత్మ సాక్షాత్కారం |
| 11. | మానవ ధర్మం |
| 12. | సేవ, పరోపకారం |
| 13. | ప్రతిక్రమణ |
| 14. | భార్యాభర్తల దివ్య వ్యవహారం |
| 15. | అంతఃకరణ స్వరూపం |
| 16. | పాప-పుణ్యం |
| 17. | తల్లి-తండ్రి, పిల్లల వ్యవహారం |

❖ తెలుగులో మరిన్ని పుస్తకాలు జోడించబడుతున్నాయి మరియు త్వరలో అందుబాటులోకి వస్తాయి.

❖ దాదా భగవాన్ పుస్తకాలు వివిధ భాషలలో అందుబాటులో ఉన్నాయి. గుజరాతీ, హిందీ, ఇంగ్లీష్, మరాఠీ, తెలుగు, కన్నడ, ఒరియా, మలయాళం, బెంగాలీ, పంజాబీ, అస్సామీ, తమిళం, జర్మన్, స్పానిష్, రష్యన్, మొదలైనవి.

❖ 'దాదావాణి' పత్రిక ప్రతి నెలా మూడు భాషలలో ప్రచురితమవుతుంది : గుజరాతీ, హిందీ & ఇంగ్లీష్.

❖ అన్ని దాదా భగవాన్ పుస్తకాలు మరియు మ్యాగజైన్‌లు ఆన్‌లైన్ పుస్తక దుకాణంలో కూడా అందుబాటులో ఉన్నాయి : https://store.dadabhagwan.org

# దాదా భగవాన్ ఫౌండేషన్ తెలుగు యూట్యూబ్ ఛానల్




❖ ఇది అడాలజ్ దాదా భగవాన్ ఫౌండేషన్ యొక్క అధికారిక తెలుగు యూట్యూబ్ ఛానెల్.

❖ దిగువ లింక్ నుండి తెలుగు భాషలో సత్సంగ వీడియోలను చూడండి.

**'Dada Bhagwan Foundation Telugu' Channel:**

https://dbf.adalaj.org/yttelugu

*Open Link OR*

*Scan QR*

---

*Dada Bhagwan Foundation Youtube video channels are available in other regional languages: Gujarati, Hindi, Marathi, Bengali, Tamil, Telugu, Kannada, Malayalam, Spanish, Portuguese, etc.*

## Contact details

Dada Bhagwan Parivar


**Adalaj:** (Main Center) **Trimandir,** Simandhar City, Ahmedabad-KalolHighway, Post: Adalaj, Dist. Gandhinangar, Gujarat, India - 382421
Phone: +91 79 3500 2100, +91 9328661166/1177
Email: info@dadabhagwan.org

**Mumbai**: **Trimandir,** Rishivan, Kajupada, Borivali (E)
**Phone:** 9323528901

**Pune:** **Trimandir,** Pune-Bengaluru Highway, near Khed-Shivapur, Varve BK, Dist-Pune, Maharashtra
**Phone:** 7203098409

| | | | |
|---|---|---|---|
| **Delhi** | : 9810098564 | **Bengaluru** | : 9590979099 |
| **Kolkata** | : 9830093230 | **Hyderabad** | : 9885058771 |
| **Chennai** | : 7200740000 | **Pune** | : 7218473468 |
| **Jaipur** | : 8890357990 | **Jalandhar** | : 9814063043 |
| **Bhopal** | : 6354602399 | **Chandigadh** | : 9780732237 |
| **Indore** | : 6354602400 | **Kanpur** | : 9452525981 |
| **Raipur** | : 9329644433 | **Sangli** | : 9423870798 |
| **Patna** | : 7352723132 | **Bhuvneshwar** | : 8763073111 |
| **Amravati** | : 9422915064 | **Varanasi** | : 9795228541 |

| | |
|---|---|
| **U.S.A** | : **DBVI Tel.** : +1 877-505-DADA (3232),<br>**Email** : info@us.dadabhagwan.org |
| **U.K.** | : +44 330-111-DADA (3232) |
| **Kenya** | : +254 795-92-DADA (3232) |
| **UAE** | : +971 557316937 |
| **Dubai** | : +971 501364530 |
| **Australia** | : +61 402179706 |
| **New Zealand** | : +64 21 0376434 |
| **Singapore** | : +65 91457800 |

www.dadabhagwan.org

## జరిగిందే న్యాయం



ప్రకృతి ధర్మాన్ని అర్థం చేసుకుని, 'ఏం జరిగిందో అదే న్యాయం' అనుకుంటే, మీరు ఈ జగత్తులో ముక్తిచెందుతారు. కానీ ప్రకృతి అన్యాయంగా నడుస్తుంది అని ఏమాత్రం అనుకున్నా, అది మీ జీవితంలో సంక్షోభానికి కారణమౌతుంది. ప్రకృతి ధర్మాన్ని అంగీకరించటమే జ్ఞానం. 'ఎలా జరుగుతున్నదో అదే సరి' అని అర్థం చేసుకోవటం జ్ఞానం, 'ఎలా జరుగుతున్నదో అదే సరి' అని అర్థం చేసుకోకపోవటం అజ్ఞానం.

'ఏం జరిగిందో అదే న్యాయం' అన్నది తెలుసుకోవటం, సంసార సాగరాన్ని దాటించేటువంటది. ఈ ప్రపంచంలో ఒక సెకండు కూడా అన్యాయం జరగదు. న్యాయమే జరుగుతుంది. కానీ బుద్ధి మనలను పెడతోవపట్టిస్తుంది, దీన్ని న్యాయమని ఎలా అంటావు అని. అందువలన నేను మౌలికమైన ఈ సూత్రాన్ని చెప్పదలచుకున్నాను, 'ఇది ప్రకృతి న్యాయం' అని, బుద్ధి నుంచి నీవు వేరై చూడు అని. ఒకసారి అర్థం చేసుకుంటే ఇక బుద్ధి చెప్పేది నమ్మగూడదు. ఏం జరిగిందో అదే న్యాయం.

–దాదాశ్రీ

मूल दीपक से प्रकटे दीपमाला

dadabhagwan.org

ISBN 978-93-86289-17-9

9 789386 289179

Printed in India

Price ₹ 50